# మరణ సమస్య - సరికొత్త వేదాంతం ★

రచన: సీతారామ శాస్త్రి

3

"ఒకమనిషి తనయొక్కజీవితములో ఎన్నడయినా చావును గూర్చి ఆలోచిస్తాడా అన్నది గూడా యోజించాలి. ఏసమయమందయినా, తన కష్టజీవితానికి, సంశయాత్మకమయిన పరిస్థితులకు ఒక్కటే ఒక్క అంతమున్నదని, అది ఈలోకాన్ని విడిచిపెట్టడమని యోచించడు. అందుకు ఒకమనిషియొక్క జీవితములో ఒకరోజు చర్య వర్ణిస్తాను.

"అతను ఒక ఆఫీసులోని గుమస్తా. ఆ రాత్రి పదిన్నర గంటలవరకూ పనిచేసి, అప్పటికినీ పూర్తికానిపనిని, మరునాటికి దాచి, ఆ చీకటిలో కాళ్లుఈడ్చుకుంటూ వస్తూన్నాడు. ఆరాత్రి మొదటి ఆట సినీమా చూసివస్తున్న వారి వివిధ విమర్శలను వింటూ, అప్పుడే మూయబోతూవున్న మిఠాయీ దుకాణాలలోని, ఫలహారముల పరిమళాన్ని ఆస్వాదిస్తూ, తనకు గుమ్మం ఎక్కడానికి గూడా అధికారములేని దివ్యభవనాల విద్యుద్దీపోద్దీపిత బహిర్ద్వారములలోంచి లోపలి సుందర వస్తుసంచయాన్ని చూడ్డంతోనే సంతోషిస్తూ ...ఈవిధముగానే తన ఇంటికి పోవలసిన మార్గాన్ని పట్టి, ఏరోజునగూడా శుభ్రము చేయబడక కుళ్లునిలువజేయుటకే ఉన్నట్లున్న మురికికాల్వల నుండి వెల్వడే దుర్గంధమును వాసన చూడలేక ముక్కుమూసికొని, ఆ గాలినే ఏ అడ్డులేకుండ నోటివెంట పీల్చుకుంటూ, ఆ యంధకారములో, ఏనాడును బాగుచేయబడని మునిసిపల్ రోడ్ల కంకరరాళ్లు చెప్పులులేని తన కాలివేళ్లను అడపాతడపా రక్తప్రవాహమునకు ప్రోత్సహిస్తున్నా, ఏదో విధంగా సహించి, ప్రొద్దుట తిన్న అన్నము జీర్ణము అయిపోగా కాలిపోతున్న ప్రేవులతో ఇల్లుచేరుకున్నాడు. ఇంటిలో తను, తన భార్య, నల్గురు పిల్లలు, ఇంటినిండా ఎలుకలు, మంచమునిండా నల్లులు, గదులనిండా దోమలు...వహ్వా ... కావలసినంత సంసారం. దీనినంతటినీ అతను పోషించాలి. ఆ పోషణకు ఉదయం పది గంటలనుండి, రాత్రి పది గంటలవరకూ, ఆఫీసరు పెట్టే చీవాట్లను తింటూ పనిచెయ్యాలి...ఆవిధంగా తను ఈ లోకంలో బ్రతకడానికి అధికారం సంపాదించుకోవాలి.

"ఆరాత్రి పదిన్నరకు గుమ్మమెక్కిచూసీసరికి, ఒకమూల భార్య చాపపరచుకొని పడుక్కున్నది. ఆవిడ ఆ మధ్యాహ్నమునుండి ఇంటిలోనికి రావడానికి వీలులేదు. అంటే, ఈయనకు వంటఇల్లుగూడా చేరవలసిన వీలులేక, అవసరము కాక, అవస్థపట్టింది...తను ఇంక ఆపూట వండుకోవాలి ... వండుకొని తినాలి...ఇంతచేస్తే రేపటికి పనికివెళ్లగలడు. ఎల్లుండికి డబ్బు సంపాదించగలడు...మరునాటివరకు బ్రతుకగలడు. ఇది తను ఆరోజు రాత్రి వంటచేస్తేనే ఉంటుంది. పెద్దకొడుకు ఆరేళ్లవాడు ఏ డ్చే డ్చి పడుక్కున్నాడుగామోసు, ఒకమూలవాడు. మిగిలిన ముగ్గురూ ఒకమంచంమీద దొర్లుతున్నారు. ఆఖరివానికి కడుపులో బల్ల. కాళ్లు చేతుల కుండవలసిన కండనంతా పొట్టేతీసుకున్నట్లు, ఆపొట్టే ఎత్తుగా కనుపిస్తోంది. ఆ కుర్రవాడు మహాపెంకి ఏది తనకు పడదో అదే అతని ఆహారము... అంటే, ఆ కుర్రాడు చచ్చిపోతాడేమోనన్న భయమువలన, అతనికి ఇష్టమయిన పదార్థాలను తిననివ్వరా తలిదండ్రులు. ఆఖరుకి రుచిగా ఉండే వస్తువులనుకూడా తిననివ్వకుండా ఆ బ్రతకనివ్వడమెందుకో? మూడవవానికి కోరింత దగ్గు. ఈనెలలో అందిన జీతమంతా వాని మందులకే అయింది...ఇంకా డాక్టరు బిల్లు బిల్లుగానే ఉంది. దగ్గు తగ్గినజాడ కనుపించలేదు. తనూ గుమ్మం యెక్కగానే ఆ కుర్రాడు దగ్గు మొదలుపెట్టేడు. ఖర్... ఖర్ ...మని ఒక్కటే గోల. ఊపిరందడము లేదు...కాళ్లూచేతులు చుట్టుకుపోతున్నాయి ...కడుపు ఉబ్బిపోతున్నాది ... గొంతుకు పొడారిపోయి రక్తనాళాలు గూడా తెగడానికి సిద్ధంగా ఉన్నాయి. కళ్లు ఎగబడ్డాయి...ఒక పావు గంట అయింది. ఖర్ ...ఖర్ ...ఒకమహాసముద్రం...ఒక సుడిగాలి...తనకళ్లముందు తనకొడుకు బాధపడిపోతున్నాడు. కిరకిరచుట్టుకుపోతున్నాడు... అబ్బ! ఎంతబాధ. ఇంతటిబాధతోటీ బ్రతుకుతున్నాడా కుర్రాడు, ఆవిధంగా బ్రతకడానికి, తను కష్టపడి సంపాదించిన డబ్బంతా డాక్టరు ఎదాన్న పోసేడా అసామి. ఖర్ ... ఖర్ ...ఇంకా తగ్గలేదు ... ఏ క్షణమందు ప్రాణాలు పోతాయో...పాపం, అతను అలాగే చూస్తున్నాడు. అటువంటి సమయంలో ఏదో ఒక మందు ఇస్తే కొంత శాంతిస్తుంది. కాని ఏదీ ఆమందు! ఆరోజుకి రెండు రోజులక్రితమే ఉన్న డబ్బంతా ఊర్పయిపోయింది. నెలాఖరు. ఇంకా నెల మొదలంత దూరంలోనే ఉంది. మందు అక్కరలేకుండానే శాశ్వతంగా శాంతికల్పించవచ్చు అతను తలచుకుంటే కాని అతను చేయగలడా? దగ్గు కొంచెం తగ్గింది. పాలుపడదామని పొయ్యి అంటించేడు కర్రలకంటె కళ్లే బాగా మండేయి. కాని, పాలో? వారికంటే ముందుగానే పిల్లికంటబడ్డాయి వెచ్చబెట్టుకోనక్కరలేకుండానే తాగింది. ఆసమయంలో హార్లిక్సు పడితే బాగుంటుంది. కాని, ఆ హార్లిక్సు దుకాణంమీద ఉంది. అది ఇంటికి రావడానికి డబ్బు కావాలి. ఆ డబ్బుకి ఇంకా పదిహేనురోజులు వ్యవధి ఉన్నాది. తనకు అకస్మాత్తుగా పదివేల రూపాయలు దొరుకుతే ఎంత బాగుండును! ఆరాత్రికిరాత్రి తనకు తెలియని తన గొప్పతనమును దేశమంతా తెలిసికొని, ఇంకొక క్షణములోగా ఒక పెద్ద పూలదండతో తనను అలంకరించి, ఒక గంట లోపుగా ఆదేశాని కంతటికీ రాజుగాచేస్తే ఎంత బాగుండును? వెంటనే అర్ధశేరు పాలు తెప్పించి వెచ్చబెట్టి ఆ కుర్రాడికి పట్టేసును గద! పాపం, అలా ఆలోచిస్తూనే ఉన్నాడు. అంతకంటే తను చేయగలిగిందిమాత్రం ఏమిటి? అంతమంది పెద్దమనుష్యులు ఒక్కమాటు రావ

దానికి తన గుమ్మం సరిపోతుందా? అన్నా! అందరూ పెద్దమనుష్యులేవస్తే, తను ఎక్కడ కూర్చోబెడతాడు? కుర్చీ ఒక్కటే ఉంది. కావలసివస్తే తనపెళ్లాన్ని ఒకమూలకు నిల్చోమని ఆచాపగూడా వాడతాడు. పాపం... ఆలోచిస్తున్నాడు. ఇవన్నీ ఆకాశ హర్మ్యాలని తనకు తెలీదు. కాని తనకు తెలిసి తెలియనట్టు లుండేది ఒక్కటే. అది అతని చావు. దానికి కుర్చీగాని చాపగాని అక్కరలేదు. దానిని బహుమానించవలసిన అవుసరములేదు. అది అల్పుడిఇంటికయినా వెడుతుంది. ఎంతటి ధనికుని భవనమయినా ఎక్కుతుంది. కాని దానిగూర్చి ఆలోచించడేమి ఈతడు. కుర్ర వాడు మళ్లా పండుకున్నాడు. ఇక నతడు పొయ్యిమీద ఎసరుపెట్టాలి...తను వస్తూన్నప్పుడు కూరకొనుక్కోనడము మరచిపోయేడు లేకపోతే ఎంత బాగుండును? అన్న, బియ్యము అయిపోవచ్చేయే ... మరొక వారము రోజులు గూడా వచ్చేట్టు లేదు...పోనీ, ఈ మాటు గూడా ఆసెట్టినుండి కొంత అరువుచ్చుకుంటేనో...ఇంకా పదిహేను రోజులుంది జీతాలందడానికి. తనభార్య మధ్యాహ్నమే గామోసు పైన ఉన్నది. ఈవంటతట్ట ఇంకా రెండ్రోజులు మొయ్యాలి వెధవది. ఆ ఆఫీసరుతోటే బాధపడలేకుండా ఉంటే, ఇదొకటి. లేకపోతే ఆ ఫయిలు కనుపించకపోవడమేమిటి? ఎక్కడ ఉండి ఉంటుంది? ఆ సుబ్బారావుగాడే ఏ మూలో పడేసి ఉంటాడు. చూడు ఎంతలాబొంకేడో! కానీ, వాడుమాత్రం ఉట్టిగట్టుకు ఊరేగుతాడా! నాలాంటివారిని కష్టపెట్టి మళ్లా నలుగురిలోనూ అవుననిపించుకోగలడా! అమ్మోయి, దీనమ్మకడుపుకాల, ఏం జోరుగా కాలింది! ఏం అంత కాలకపోతేనేమిచెయ్యి’ మొత్తానికి ఏదో ఇంత ఉడికించుకొని, పిల్లలను లేపి, వారికిపెట్టి, ఆ ఎంగిళ్లు ఎత్తుకొని, కంచములు కడుక్కొని, తను తిని, తన భార్యను లేపేడు. ఆమెకూడ ఒక ఆఫీసరే తన భర్తమీద. ‘ఏం ఇంత ఆలస్యమయింది. ఇంట్లో ఆడవాళ్ళు చచ్చేరో, బ్రతికేరో. ఒక మాటయినా జ్ఞాపకం వస్తుందా?’ అని గర్జించింది. నిజంగా ఈ రెంటిలో ఏది సౌఖ్యతరమో తెలియలేదా భర్తకి అలాగే నిల్చొని ఆలోచిస్తున్నాడు. భార్య చనిపోయేఉంటే, తనకా బాధ ఉండకపోనేమో! ఈ కొడుకులు, ఈ చికాకులు ‘ఏమిటి వండేరు’ మరో గర్జింపు. మనవాడు మళ్లాలోకంలో పడ్డాడు. ఏదో ఇంత వడ్డించి, ప్రతీనిముషానికి చీవాట్లు తింటూ, ఏదోవిధంగా ఆరాత్రి సమాప్తిచేసి, పండుకొందికి ప్రక్కమీద వ్రాలేడు.

“తనకు ఎంతమట్టుకు వ్యక్తిత్వం ఉంది· తెల్లారిలేచి గొడ్డులా పనిచెయ్యాలి. అయిన వాళ్ళచేత, కానివాళ్ళచేత చీవాట్లు తినాలి. నిద్రాహారాల్లో సుఖం పరిత్యజించాలి. రేపను రోజుల్లో సగం తిండితోటే సంతసించాలి.

---

# ప్రకటన

చిత్రగుప్త చందాదారులు ఆఫీసుకు ఉత్తరాలు వ్రాయునపుడు తమ చందా నంబరు తప్పక తెలుపవలయును. అలాగుచేసిన ప్రత్యుత్తరము త్వరలో బడయగలరు. తమ చందా నంబరు తెలుపనపుడు ఆఫీసు ఉద్యోగులకు వృథా శ్రమయు, కాలయాపన జరుగుచుండును.

మేనేజరు,

చిత్రగుప్త ఆఫీసు.

---

కంట్రోలు దినాల్లో, బ్లాకుమార్కెటులో డబ్బుపోసి మందులుకొనాలి. కాటకంరోజుల్లో కావలసిన చీరలు కాంతారత్నానికి జత పెట్టాలి. వీటన్నింటికి తను దివారాత్రాలు పనిచెయ్యాలి. పనిచేస్తూ అందరిచేత చీవాట్లు తినాలి. ఈ బాధలన్నీ లేకపోతే నేమి ?... ఎక్కడనుండయినా అమితధనం దొరుకుతే ఎంత బాగుండును ? ఏ బైరాగో తన మంచముక్రింద బంగారపుబస్తాలు పెట్టి వెళ్ళిపోతే ఎంత బాగుండును! క్రిందకిచూసేడు ఏమైనా ఉన్నాయేమోనని. మంచముక్రింద ఎలుక పెంటికలు గుడ్డివెల్తురులో బంగారములాగే మెరుస్తున్నాయి. ‘నాకు సౌఖ్యం ఎలావస్తుంది? మళ్ళా ఆఫీసరు ఫైలుఊసు అడుగుతే ఏమిటి చెప్పడము. దీనికి మరో మూడు రూపాయిలు ఫైను పడుతుంది గామోసు. కోమటివాడికి రేపే ఇస్తానన్నాను గదా డబ్బు, రేపు వాడువచ్చి ఆఫీసులో అల్లరి పెడతాడుగామోసు ! ఆహా ! ఏం దివ్యంగా ఉంది నా జీవితము ! ఆ మూర్తిగాడి అదృష్టమే అదృష్టము ! లేకపోతే తనకంటే జూనియరు, తను కండేమ్నుయిపోవడ మేమిటి ! వాడు తహసీల్దారయిపోయి, సంచులకు సంచులు దోచుకొనడమేమిటి ? అంతా విధి ? ఎవనికి ఎంతరాసివుంటే అంతే ! మనచేతిలో ఉందా !

“అలాఅంటూ పడుక్కున్నాడు, లేచేడు ‘అమ్మో ఏడున్నర ! కాఫీగుండేది ? అబ్బ, పొయ్యి మండదేం ! పంచదారలేదు గామోసు ! కుర్రవాడికేమిటి యివ్వడం ! వెధవడి, పప్పులో ఉప్పు అయిపోయింది ! నాలైబ్రరీ పుస్తక మేది ! నా టోపీ ఏది ? అబ్బ ! అప్పుడే పదిన్నర ! తలుపు గట్టిగా వేసుకో, ఈ త్రోవలోనే గామోసు ఆ సెట్టి ఇల్లు. ఆ సందులోంచి పోదాం అన్నా ఇక్కడే కూర్చున్నాడే. హమ్మయ్య, చూడలేదు. ‘ఆఫీసరుగారు పిల్చేరు’ ఏదీ ఆ కాగితమేది? ఇక్కడలేదే వెధవపని, ‘చిత్తం, చిత్తం తమ దయ. తమరు కరుణించకపోతే ఫైను వేస్తే ఇచ్చుకొనలేను, పిల్లలవాణ్ణి డిస్మిసే పోనీ ఆ ఫైనే ఇచ్చుకుంటా’ అబ్బ ఏమి ప్రారబ్ధం ఈ పోస్టుమేను వచ్చేడేమో ఎక్కడనుండయిన మణియార్డరు పట్టుకొని? అన్నా తెల్లకాగితాలు అయిపోయేయే. కాఫీనీళ్లకు డబ్బులున్నాయా ? కానీకి ఎవరయినా కప్పుకాఫీ ఇస్తారూ! శాస్త్రి వెళుతున్నట్టున్నాడు. వాడితో వెళ్తేనో భోగంపిల్ల సినీమాట ! చాలా బాగుంటుందిగామోసు. మరో కానీ ఉన్నాదేమో? అన్నా! నా పెళ్ళాం తెమ్మన్నది తేలేదే. ఇంటికివెళ్తే బ్రతుకనిస్తుందీ ! ఏం, కర్మం వచ్చింది. ఎన్నాళ్ళో ఈ కష్టాలు’ అంటూ రెండోరాజు రాత్రి పదిన్నరకు గుమ్మం ఎక్కేడు, రోజుగడియడ మొక మహాకష్టం. అలాగే గడిపేడు 45 ఏళ్ళు.

మళ్ళా ఆ కొంపలోనికి అడుగుపెడుతున్నాడు. మళ్లా రేపు తెల్లారుతుంది. ఆఫీసరు ఫైల్సు, చీవాట్లు కేకలు. రాత్రి అవుతుంది. పెళ్ళాం, పిల్లలు, మందులు. సామాన్లు, అశక్తత, చీవాట్లు, చీపురుదెబ్బలు కాని ఆ పరిస్థితులతోటే ఎల్లుండిగూడా వస్తుంది. ఈ విధంగానే నడిచేయి చైత్రం, వైశాఖం, జ్యేష్టం, ప్రభవ, విభవ, శుక్ల, ప్రమోదూత ఇప్పటికి 45 సంవత్సరములు. ఇంకా నడుస్తున్నాయి. తను కష్టాలు అనుభవిస్తున్నాడు. కాని అందులోంచి పైకి రాలేకుండా ఉన్నాడు. అంతకంటే, ఒకరోజురాత్రి తన ఆఫీసు పని పూర్తిచేసుకొని, తాళాలు డ్రాయరులో పడేసి, మరుసటినుంచి తను రాలేనని ఒక కాగితము ముక్కరాసి, ఆఫీసరు టేబిలు మీద పెట్టి, చక్కగా పార్కురోడ్డెంట పోతూ, రేడియోపాట నానందిస్తూ, కావలసివస్తే రెండోఆట సినిమాచూసి, హాయిగా పెద్దచెరువుగట్టుమీద ఒక అరగంట ఆగాలిలో తిరిగి స్నానంచెయ్యడానికి దిగినట్టే దిగి, సుఖంగా లోపలికి నడచి, ఎన్నటికీ పైకి రాకుంటేనేమి? మరునాటినుండీ ఈ బాధ వుంటుందా? తన పెళ్లాం పిల్లల సంగతా... ఇంక వారిసంగతి వారే చూసుకుంటారు. ఆఫీసుపనికి విచారమా... పోనీ ఇంకొకనికేనా ఇంక్రిమెంటు దొరుకుతుంది ... ఇంతకి తను వెళ్లిపోతూఉంటే, ఇంకొకరిగూర్చి తాపత్రయము యెందుకు... పుట్టినప్పుడు వీరందరితోటీ పుట్టేడా?

"అసలు నేను చెప్పదలచుకొనే దేమిటంటే, ఏవ్యక్తికూడా జీవితానికి చావు అనే వైకల్పికము ఉన్నదనే తలంపడు. ఎన్నికష్టాలయినా అలాగే అనుభవిస్తారు గాని, ఒక్కమారయినా చచ్చిపోదామనుకోరు. కాళ్ళు చేతులు రంపములతో కొయ్యడానికేనా వప్పుకుంటారు కాని, ఒక్కమాటు పీకతియ్యడానికి వప్పుకోరు. క్రొత్తగవర్నమెంటులు, ఏదో ఘనకార్యంచేసినట్లు ఉరిశిక్ష తీసివేసి, నిదానస్థానే ఆ జన్మాంతం ఖైదులో ఉంచే ఏర్పాటు చేస్తారట! ఏం ఉదారస్వభావం!

"ఈ విషయాలన్నీ చూస్తుంటే నాకు మతిపోతోంది. ఇంతకీ మనిషి అలా బ్రతుకుతూ ఉండడములో నాకేమాత్రము ఉద్దేశ్యము కనుపించలేదు. అపిచ, అందుకొరకు తాపత్రయపడడమూ అర్థము కాలేదు. ఏమిటి, మనిషి, ఇంకొక గత్యంతరములేక అనవసరముగా ఈలోకమనే చీకటికొట్లో బ్రతుకుతున్నాడా? పోనీ చచ్చిపోయి చూద్దామనుకుంటే ఏమో, నే నెక్కడయినా పొరబడుతున్నానేమో నని అనుమానం. లేకపోతే ఇంత పెద్ద పెద్దవాళ్ళు, మంచి తెలివయినవాళ్ళుగూడా, ఎందుకో తెలియకుండానే బ్రతుకుతున్నారా? అదీగాక, ఎందుకన్నారో ఆత్మహత్య మహాపాపం అని గూడా అన్నారాయెను! అటువంటిఅప్పుడు ఆ బ్రతుకులోని ఉద్దేశ్యమేమిటో స్పష్టంగా తెలిసికొనకుండా చచ్చిపోతే 'ఆ వెనుక' అంటూ ఏమయినా ఉంటుందా?

"మొత్తానికి ఇదొక రోగంలాగున నన్ను పట్టుకుంది అనవరతమూ. 'ఎప్పుడు చచ్చిపోతావ్' ఎందుకు బ్రతుకుతావ్! ఎప్పుడు ఎందుకు...ఎప్పుడు' అన్న ముక్కలే నన్ను వెంటాడుతున్నాయి. ఇప్పుడు ఒకబట్ట కొనుక్కుందామని షాపు గుమ్మంఎక్కితే, 'చచ్చిపోయేవాడికి నీకు చొక్కా ఎందుకు' అని ఎవరో అంటున్నట్లు తోస్తుంది. ఏమయినా మంచి వస్తువులు తిందామనుకొనేసరికి 'ఏమిటి శాశ్వతం' అని ఎవరో హెచ్చరిస్తున్నట్టు అనుపిస్తుంది. అంతెందుకు; నాకు ఈ సంశయము కలిగినదగ్గరనుండి, తిన్నగాతిని, బట్ట కట్టి, నిద్రపోవడములేదంటే నమ్మండి! రాత్రి పడుకొబోయేముందు ఆరాత్రే నాఆఖరి నిద్రఅనుకుంటాను. తెల్లవారిలేస్తే ఆరోజుతో సరి అనుకుంటాను.

(మిగత వచ్చేసంచికలో)


## జీవానందరసాయనము

ఊరుపిచ్చుకల సత్తుతో ఫలరసములతో మలయాళ పద్ధతిలో తయారుచేయబడినది. స్త్రీ పురుషులకు గలుగు అన్ని వ్యాధులకు ఇది దివ్యౌషధము. రుచికరమైనది. పథ్యములేదు. సర్వకాలములందు యెల్లరు భుజింపదగినది.

జీవానందరసాయనమును పుచ్చుకొనిన జీవనరములలోచేరి వచ్చిన మేహ దుర్నీరు నశించును. స్త్రీ సంభోగముచే నేర్పడిన తెలుపు కాక, గ్రంధి, మేహవ్యాధి, మేహదురద, పిత్తపాండు, క్షయ, కాసలను పోగొట్టును దీనితోసాటి వేరొకటి లేదు. దురభ్యాసమువలన (హస్తప్రయోగాదులచే) గుహ్యావయము దుర్భలమై చిక్కిపోవును. వేడి, బలహీనము, ధాతునష్టము, స్వప్నస్ఖలితము, నరముల బలహీనత, ఆయాసము, దేహభీతి, ఆకలిలేకుండుట, మలబద్ధకం, గుల్మము, అజీర్ణం, నిద్రలేకుండుట, మేహకాక, రక్తముచెడుటచే గల్గు వ్యాధులు, మూలకాక, గుండెదడ, వెన్నునొప్పి, దగ్గు, ఇంద్రియము నీరై మూత్రములో పోవుట, స్త్రీలకడకుచేరినను తలచినను వెంటనే స్ఖలితమైపోవుట సంభోగచింత గలగనే తనకు తెలియకనే ఇంద్రియముపోవుట, కాలు చేతుల బలహీనత, జ్ఞాపకశూన్యము, దృష్టిమాంద్యము, మొదలైన లెక్కలేని వ్యాధులను పోగొట్టి, వీర్యవృద్ధి, ధాతుపుష్టి, రక్తవృద్ధి, భోగశక్తిని అపారముగ గల్గించును. శక్తివిహీనమై దుర్భలమైన గుహ్యేదయమునకు బలమునిచ్చి వృద్ధిచేసి రక్తకండరములను పెంపొందించును. సాటిలేని సంభోగానందమును గల్గించును. స్త్రీలకు గలుగు ఋతుదోషము, రక్తము అధికముగ స్రవించుట, సంతానాధిక్యమువలన దేహము కృశించుట, మర్మావయవము కృశించుట, బలహీనము, మర్మస్థానమున దురద, మంట, నొప్పి, వేడిచే తెలుపుకారుట, చర్మ సంబంధమైన మేహవ్యాధులు మొదలైన అనేక వ్యాధులను ఖండించి దేహమునకు, పుష్టి, బలము, కాంతిని కల్గించును. ½ పౌను టిన్ను 1-కి 2-12-0 తపాలాచార్జి 0-12-0

ధనలక్ష్మి అండు కో., సాకారుపేట పోస్టు, మదరాసు.

# మరణ సమస్య - సరికొత్త వేదాంతం ★

రచన: సీతారామశాస్త్రి

౪

ఈవిధముగా బ్రతకలేక, చావలేక ఉంటూ తిరుగుతూన్న సమయంలో ఒక సాయంత్రము దేవాలయములో ఒక సన్యాసి తారసపడ్డాడు. అతడు ఒక సన్యాసి. వాంఛలను త్యజించేడు ... ద్వంద్వాలను అతిక్రమించేడు...కష్టసుఖాల కతీతుడయ్యాడు... ఒక సుఖంకోసంగాని, ఒక పదవికోసంగాని, ఒక కుటుంబపోషణార్థముగాని జీవించవలసిన, అవస్థ దాటిపోయిన నిర్వికారజీవి. అతనికి ఈలోకముతో ఎట్టిసంబంధమునులేదు. తను గడించేదిలేదు, నష్టపోయేది లేదు. అన్ని విధములా అతడు ఒక గతజీవి. అతనికిప్రపంచకముతో అవసరము తీరిపోయింది. ప్రపంచకమున కతనితో ప్రసక్తి మీరిపోయింది. అట్టి ఒక సన్యాసి, (ఆవిధముగా ఉండవలసిన సన్యాసి), ఏదోవిధంగా, చెట్టుక్రిందనో, పుట్టక్రిందనో నివసిస్తూ, పండో, కాయో, దుంపో, ఏది దొరికితే అది తింటూ జీవిస్తున్నాడు. తనను ఎవ్వరుగూడా లక్ష్యపెట్టని ప్రపంచకంలో అలాగే చావకుండా నిలచి ఉన్నాడు. అట్టి మనిషికి చనిపోడానికి ఎన్ని సదవకాశాలున్నాయి! సాధారణ మానవుల నెదుర్కొనే ఎట్టి సంశయాలు అతనిని ఎదుర్కొనవే. అట్టిఅతను బ్రతికి ఉండడమెందుకు! 'అతడు బ్రతికిఉండడమువలన నష్టమేమిటి' అన్న సందియము కూడ కలుగక పోలేదు. కాని, ఇంతకుముందు ఇద్దరి ముగ్గురను 'ఎందుకయ్యాబ్రతకడము' అని ప్రశ్నిస్తే నేనొక్కడనేనా ఏమిటి, ఎంతమంది పూర్వులు జీవించలేదు, నిర్వికారులయిన మహామునీశ్వరులే, చిరకాలం జీవిస్తూఉంటే, నా జీవితమే భారమయిపోయిందా' అని అన్నారు. అందుచేత ఈ మార్గదర్శకులనే కనుక్కుంటే విషయం తేలిపోతుందనే ఉద్దేశ్యంతో అతనిదగ్గర చేరేను. నావంటి ఆధునిక యువకుడు, అట్టి ఒకబైరాగివద్ద వుంటే, లోకరీత్యా ఒక చిలుంరాయుడుముందు కూర్చొనడము అక్కడవున్న చాలామందికి ఆశ్చర్యకరంగానే ఉంది. నిజానికి నాకుకూడా నామోషిగానె ఉంది, అక్కడకూర్చొనడము. ఇంతకుముందు ఎన్నిసార్లు ఇట్టి బైరాగులను, దేశానికి చీడపురుగులనీ, దేశద్రోహులనీ, చోరులని, జారులని తిట్టేనో!. అట్టి సన్యాసివద్ద ఈ నా సంశయము వల్లనేకదా, నా అభిమానాన్నంతనూ చంపుకొని కూర్చొనవలసి వచ్చింది.

"అతనివద్ద ఆవిధంగా ఒకగంట బుర్ర వంచుకొని కూరుచొనుసరికి, ఆ సన్యాసి గూడా కళ్లుతెరచి, చిరునవ్వుతో, 'ఏమి నాయనా, ఏమి యిలావచ్చేవ్' అని అడిగేడు. నాకు ముచ్చెమటలు పోసేయి. ఆ కాషాయ వస్త్రాలమాటున, ఖూనీకోరులు మొదలు పరమ జ్ఞానుల వరకూ, ఎందరెందరో ఉంటున్న సమయములో, నే నెట్టి వ్యక్తిముందు కూర్చున్నానో నాకేమి నమ్మకము. అయినా కొంత మామూలు సంభాషణ అయినతర్వాత, ధైర్యముచేసి ఈ విధముగా అడిగేను. "స్వామీ, మనిషి భూమిమీద బ్రతుకవలసిన అవసరమేమిటి?" అని. స్వామిగారు ఆలోచనలో పడ్డారు. కళ్ళుమూసుకున్నాయి, బొమలు ముడివడ్డాయి. ముక్కు మీదకెక్కింది. మూతి చిన్నదయింది. అయినా యింత చదువుకున్న జ్ఞానికి జవాబే దొరకదా. 'నేనుఇప్పుడు చెప్పలేనోయ్!. మనిషి కర్మచక్రంలో, వాంఛా మోహితుడై, పరిభ్రమిస్తూ, ఫలబంధాలలో చిక్కుకుంటాడని.' మళ్లీ చక్రాలు సాలెపట్లు బయలుదేరేయి. మన వేదాంతమంతా, ఈ బండీ చక్రాలతోటి, పెద్దపెద్ద సాలెపట్లతోటీ, దిట్టమయిన వలత్రాళ్లతోటి, నిండిపోయి, బూజుపట్టి ఉన్నాది గామోసు. శ్రీ స్వామివారు చెప్పుకొని పోతున్నారు. పైవారికి అర్థమవుతోందా లేదా అన్నదానితో ప్రసక్తే లేదు. అతనూ అట్టిగురువుగారి వద్దనే చదువుకున్నాడు. ఆ పాఠమే వప్పజెపుతున్నాడు. 'అందుచేత ఆ జనన మరణ సాగరములోంచి, ముక్తిపొంది, బ్రహ్మకైవల్యం చెందాలీఅంటే, వాంఛా మోహాలు విడిచి అప్పటివరకూ చేసిన కర్మఫలాన్ని అనుభవించాలి. ఆ ఫలానుభవానికి స్థూలశరీరం అవసరం. అదిలేనిది ఫలానుభవము ఉండదు. ఫలానుభవం సమాప్తి కానిదీ సూక్ష్మశరీరంలోని జీవాత్మకు ముక్తి ఉండదు. అతఏవ, ఇచ్ఛలేనప్పటికీ, కేవలం ఫలానుభవార్థం, జీవధారణం అవశ్యం అన్నమాట!' అని ముగించేరు నాకు అర్థమయిపోయిందన్న నిర్ధారణతో.

"కొంత అర్థముకూడా అయింది. అంటే, ఈ స్వామిగారు అన్న దానిప్రకారం, జీవితముయొక్క పరమావధి బ్రహ్మకైవల్యమని, అందుకు ఈ పుట్టుకచావుల అలలలోంచి, ముక్తిఅవసరమని, అందుకు, కోరికలులేని జీవితము ముఖ్యమని, సత్యం గ్రహించుకొని, పరమాత్మను అర్థంచేసుకున్నవారు కూడా కేవలం పూర్వజన్మ కర్మఫలాన్ని అనుభవించడానికే జీవించా'లని సెలవిచ్చేరు. కాని, అందరూ అందుకే జీవిస్తున్నారు. అందుకే వారికి ముక్తి వేగం దొరకలేదని' చెప్తారులెండి. ఇంతకూ, ఈ ఆత్మ, పరమాత్మ, కర్మ, ఫలము, పునర్జన్మ, ఫలానుభవము, వాంఛారాహిత్యము, ముక్తి, బ్రహ్మకైవల్యము ఈ మాటలకు అర్థమున్నదా? ఇవి పైకి ఎంతో కోమలముగాను, భావగర్భితముగను కనుపిస్తాయో, అంతకు వెయ్యిరెట్లు సంశయము వెనక తోకలాగున తగులుకొని చర్చకు బయలుదేరితే, ఎన్ని రోజులయినా ఊసుకుపోతుంది, సంశయమే పోదుగాని.

"సరే. పురాతనమునుండీ, అనుశ్రుతంగా, అర్థమయినా కాకపోయినా, అందరిచేత, అంగీకరింపబడడముచేత అందులో సత్యాన్ని సందేహించడము మంచిదిగాదు. ఫలానుభవానికే జీవధారణమయితే, మళ్లా ఈ జీవితంలో చేసే నూతన కర్మలకు ఫలమో?...దాని అనుభవమో? దానికి మరోజన్మా. 'అందుకే వాంఛా రహితమయిన జీవనము అవసరమోయ్' అని స్వామిగారంటున్నారు. వహావ ఏం సద్బోధ!. వాంఛలేనిపని, పనిలేనిబ్రతుకు ఉంటాయా?. జీవిస్తూఉన్న మనిషి వాంఛ

లేకుండా ఉండగలడా?. వాటివిసర్జనలకు ప్రయత్నించకుండా ఉంటాడా?. పూర్వజన్మ కర్మఫలం అనుభవించడానికే జన్మఅయితే, అందుకుతగిన అవకాశమే ఇవ్వాలిగాని, మళ్లా కర్మాచరణంలోనికి నెట్టడమెందుకు?. ఈ కర్మాచరణకు ఇష్టములేనివాడు అందులోకి ఈడ్వబడతూ ఎదుర్కొనే శక్తిలేదని తెలిసికొన్న తర్వాత జీవితం పరిత్యజించి, ఆ బంధనం తెంచుకునేందుకు ప్రయత్నించడములో దోషమేమిటి?. పాత కర్మఫలాలు ఇంకా చిత్తాలో జమకాకుండా ఉండిపోయే యంటారా?. ఎప్పటివరకూ కర్మ చేయనక్కర లేకుండానే అనుభవించే అవకాశం ఉంటుందో అప్పుడే అనుభవించవచ్చును. ఇంతకీ వాటి పర్యవసానం తెలియని అజ్ఞానదశలోనే కదా కర్మలుజేసి ఈ ఫలాలు జతపెట్టుకొన్నాము. ఇప్పుడు వాటిసంగతి తెలిసిన తర్వాతగూడా, అందులోతగుల్కొన వలసిన అవసరమేమిటి?. మొత్తానికీ వేదాంతమంతా ఒకమిషక్రిందనే ఉంది. ఏదోవిధముగా బ్రతకడానికి లేకపోతే, ఈ బాధలేమీ లేకుండా, హాయిగా చనిపోవడానికిబదులు, ఈ కర్మలు క్రియలు, కర్తలు ఏమిటి? ఈ ఫలాలు, పుష్పాలు, దళాలు ఏమిటి?

'జీవించాలని ఇచ్ఛలేనివాడు చనిపోతే నష్టమేమిటి'. స్వామివారు సందిగ్ధములో పడ్డారు. మళ్లా కర్మచక్రంగాని ప్రయోగించరుకద! కొద్దిగా ఆలోచించేను. ఈ ప్రశ్న ఏసూతుడూ, ఏ శౌనకాదులకూ చెప్పలేదుగామోసు. స్వామిగారు చెప్ప మొదలు పెట్టేరు. "నువ్వన్నది బాగానేఉంది. జీవించాలని ఇచ్ఛలేదూ అంటే, కర్మజాలంలో కోరిక లేదన్న మాట! కాని ప్రారబ్ధ కర్మ ఏమిటవుతుందా అని ఆలోచిస్తున్నాను. అది అనుభవించడానికి ఎలాగు ఒక జన్మ ఎత్తాలి. అందుచేత ఎలాగో ఒకలాగున ఈజన్మలో అనుభవిస్తేసరి". బాగుందిఆయన ఉపాయం! ఇదేదో నాకే రహస్యముగా చెప్పిన కిటుకులాగుంది. ఏదో హాయి మాయ గారడీచేసి, ఆదేవుడు చేతకాస్తఅవుననిపించుకుంటే, ఆతర్వాత అడిగేవారెవరు?. కర్మ జాలంలో తగుల్కొనేందుకు ఇచ్ఛలేకనే చచ్చిపోతున్నాడనుకోవడమేం. అందులో తనకు కావలసిన కోర్కెలను తీర్చుకో లేకుంటవలననే అనుకోనకూడదూ. తను పెళ్ళాం బిడ్డలను పోషించుకోనలేడు. కాని వారితో సుఖంగా ఉండాలన్నకోర్కె ప్రబలంగానే ఉంది. తనకు శక్తిలేదు. అటువంటప్పుడు అనవసరముగా మనోక్షోభతో కుమిలిపోయేకంటే, ఏదో సుఖపుచూసుకొని కళ్ళు మూసివేయకూడదూ.మళ్ళాఫలానుభవంఅంటారా?. అదే అవశ్యమయితే, వచ్చేజన్మలో తగిన అవకాశం ఉంటే చూచుకోనవచ్చు. ఒకసారి పరీక్షపోతే 'పోనీలేరా నాయనా, వచ్చేఏడు ప్యాసుఅవవచ్చు' నంటారా లేదా? ఆవిధంగానే, ఈ జీవితంలో ఫైలయిపోతే, 'పోనీ అవకాశముంటే వచ్చేజన్మలో ప్యాసవుదాము'నుకో కూడదూ! వచ్చేజన్మ అంటూ ఉన్నదో లేదోఅని సంశయిస్తారా?. అలాగయితే, మరీమంచిది. ఎంతత్వరగా చనిపోతే అంత సుఖం.

స్వామివారు చిలుంగొట్టం వైపు చెయ్యి జాచేరు వాంఛారహితులై. ఆయన ఆవిధంగా బ్రహ్మార్పణయోగ్యమయిన కర్మలో నిమగ్నుడయి యున్నప్పుడు, నేనింక అక్కడ ఉండడం భావ్యముకాదని, మెల్లిగా శలవు పుచ్చుకొని, జారుకున్నాను. నేను కంటికి దూరమయ్యేవరకూ, నిరహంకార స్వామివారి కళ్ళు నామీదనే ఉన్నాయ్. బహుశః జ్ఞానపత్రికి చందా ఇవ్వలేదేమా అని గాబోలు ఆ కామరహితుని ఆలోచన!.

మొత్తానికి నా సందేహం మాత్రం తగ్గిన పాపాన పోలేదు. ఈ మహానుభావుడు పోసిన నెయ్యివలన నా సంశయం మరింత రగుల్కొనడం మొదలు పెట్టింది. ఇంతకీ ఇతనన్నదేమిటి? జీవించడమనేది మోక్షానికా? జీవితమంతా కర్మయుతమైనదై, కర్మకు ఫలము, ఫలానికి అనుభవము. ఆ అనుభవమునకు మరో జన్మ ఉండాలి అన్నప్పుడు ముక్తి అనేది పొసగుతుందా?

అయితే కర్మకు ఫలానికి ఉన్నసంబంధములో ఒక హంసపాదుమాత్రం చెప్పేరు. నిష్కామకర్మకు ఫలానుభవం ఉండదని. కాని జీవించడమనేదే ఒకకోరికతో కూడుకున్నప్పుడు, ఆ జీవితములో చేసే ఏకర్మ కామరహితమయినది?. బ్రతకాలీ అంటే తిండితినాలి. తిండితినాలీఅంటే కూరగాయలు పండించుకోవాలి. అవి ఏజంతువులు తినకుండా రక్షించుకోవాలి. అంటే, తెలియకుండా జోరబడిన వాటిని చంపడమో, తరుమడమో చెయ్యాలి. ఇంకనూ మిగిలిన జంతువుల వల్లనూ, ఎండవానలవల్లనూ చనిపోకుండా ఉండడానికి ఇళ్ళు కట్టుకోవాలి. ఆ పనికి డబ్బుండాలి. ఆ డబ్బు సంపాదించడానికి ఉద్యోగం ఉండాలి. ఆ ఉద్యోగం నిర్విఘ్నముగా జరగడానికి భార్య ఉండాలి. ఆ భార్యకు చీరలు ఉండాలి. గాజులు ఉండాలి. ముక్కుపుడకలుండాలి. ఇంకా ఎన్నెన్నో ఉండాలి. వీటికి డబ్బుండాలి. ముసలికాలంలోగూడా చనిపోకుండా జీవించి ఉండడానికి కొడుకుల సహాయముండాలి. వారు పెద్దయి ఏమిపెట్టిపోస్తారోకాని, చిన్నప్పుడు వారికి కావలసిన సదుపాయాలు సమకూర్చాలి. వాళ్లకూ పెళ్ళాలు గావాలి. దీనంతకీ డబ్బుండాలి. డబ్బుకి సంపాదన ఉండాలి. దానికితోడు జబ్బులు, పురుళ్ళు, పండుగలు, తద్దినాలున్నూ. ఇవన్నీ జీవించడానికి అవసరములే. జీవించడమనేది కామరహితమయిన కర్మేనని చెప్పి, అందుకు ఫలానుభవం ఉండదు అన్నప్పుడు ఆ జీవాధారణకు అవసరములైన ఈ సర్వకర్మలనుకూడ వదిలి పెట్టేయాలి. ఇందులో ఏది వదిలిపెట్టినా జీవితములో లోపమే. అంటే జీవించడానికి లోటు చేస్తున్నాడన్న మాటే. ,చావునుదగ్గరకు తెచ్చుకుంటూన్నాడన్నమాటే. జూదమాడితేనేగాని జీవించలేని వారెంతమందిలేరు. వారకాంతా తిరస్కృతులు ఎంతమంది నూతిలో పడలేదు.? క్రొత్త చీర కొనలేదని ఉరిపెట్టుకున్న నారీరత్నాలు ఎంతమంది కనుపించరు? దొంగతనంలో పట్టుబడిపోయి, విషము త్రాగిన వారినెంతమందిని గూర్చి వినలేదు. వీరివ్యసనానికి వీరిజీవితానికి, ఎంతటి సన్నిహితత్వమున్నదో మీరే గ్రహించవచ్చు. జీవించడమనేదే దోషరహితమయినదయితే, వారి జీవితమును నిలబెట్టే, ఆ జూదము, వ్యభిచారము, చౌర్యం ఇవిగూడా దోషరహితములయినవే అనాలి. అవే దోష భూయిష్టము లగునప్పుడు జీవితముగూడా దోషయుతమైనదేనని ఒప్పుకోవాలి. అట్టిజీవితమనే వాంఛాపూరిత కర్మకు విముఖత చూపించడమేకాదా, చావు. అందుచేత చావే మోక్షానికి దగ్గరత్రోవేమో.

(మిగత వచ్చేసంచికలో)

# మరణ సమస్య - సరికొత్త వేదాంతం ★

రచన: సీతారామ శాస్త్రి

శ్రీ

"ఇంతకీ మోక్షమనేది ఉందా? దానికి కష్టభూయిష్ఠమయిన ఈ జీవితము ఆవశ్యకమయినదా? అందువల్ల బ్రహ్మకైవల్యమనేది ఏదో సిద్ధిస్తుందా? దీనిసంగతి ఆలోచిస్తూఉంటే నాకొక తమాషా అయిన కథ జ్ఞాపకము వస్తోందిలెండి!

"ఏదో మారుమూల పల్లెటూరిలో ఉప్పు మిరపకాయల దుకాణం పెట్టుకొని, తన బ్రతుకు, తన సంసారం, లేనివాళ్ళ కడుపు కొట్టో, ఉన్నవాళ్ళ కళ్ళుకప్పో, లేనినాడు పస్తుండి, ఉన్ననాడు తినకుండా ఏదో విధంగా యీడుస్తున్న కోమటి బిడ్డకు ఏవిధంగా తారసపడ్డాడో, ఒక కాషాయ వస్త్రాల గడ్డాల బైరాగి ఎదురయ్యాడు. మరి ఆ భార్యా పరిత్యాగికి, ఈ భార్యా పరివృతునికి, ఎట్టి సామాన్య విషయంలో పరిచయం కలిగిందో కాని, ఓహో...ఆ ఫలహారాలేమిటి! ఆ జోహారు లేమిటి! ఆ సాష్టాంగ నమస్కారాలేమిటి! ఆ సంభాషాంతర సమావేశాలేమిటి! అలా గడిచిపోయేయ్ మూడు పగళ్ళు మూడు రాత్రులున్నూ. ఆ గురువుగారు, ఏసుముహూర్తంలో ఏమిటి ఉపదేశించేరో గాని మర్నాడే, ఉన్నది కాస్తా లాభానికో నష్టానికో తన వేలువిడిచిన పినతండ్రి కొడుకునకు అమ్మి ఆడబ్బు కాస్తా మూట కట్టుకొని బయలుదేరేడు ఉత్తర దిక్కుగా. ఏకోమటి ఇంట బుట్టిన వాడూ లాభములేనిపని కాస్తయినా తలపెట్టడనే శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సిద్ధాంతాన్ని, కేవలం అతని వాగ్ధాటిని చూసే నమ్మి, ఈ వణిక్శేఖరునే తన మార్గదర్శిగా ఎంచుతున్న ఒక యువక బ్రాహ్మణ వ్యాపారి, ఇతడు రాత్రికిరాత్రి వ్యాపారానికి సున్నా చుట్టి, కొట్టుకు తాళమువేయడములోని అంతరార్థము ఏమిటో తెలియక, ఉక్కిరిబిక్కిరయిపోయి పరుగుపరుగున వెళ్ళి, ఊరావల ఆ కోమటిబిడ్డను కలసికొని అడిగేడు—'ఏమిటిస్వామీ, మీకే ఏదో నా గురువుగారనుకొని, మిమ్మలనే నమ్మకుంటే, ఇదేమిటి! మీరిలా గోతిలో తోసేరు. చెప్పకుండా చెయ్యకుండా ఎక్కడికేమిటీ ప్రయాణం? ఒకరోజు ముందుగాచెప్తే నేనూ ఏదో సర్దుకుందునే' అని. ఆ కోమటిబిడ్డ మొదట కొంత తటపటాయించినా అతని ఉద్దేశ్యాన్ని ఈ విధంగా చెప్పేడు—'మనలో మనమాట, ఎవరితో అనకేం. ఆ బైరాగి వచ్చేడు చూసేవూ. అతగాడు మహా విద్వాంసుడులా గున్నాడోయ్. అతనిని ఆశ్రయించి వేడగా, వేడగా చెప్పేడు ఒక చిదంబర రహస్యం. అతను ఎవ్వరితోటీ చెప్పొద్దన్నాడు కాని, నువ్వుగాబట్టి చెప్తున్నా.

కాశీకావల కొంచెందూరంలోనే హిమాలయపర్వతం ఉందిట! ఎవరినడిగినా దారి చెప్తారటలే; ఆ కొండక్రిందనే పెద్ద మర్రిచెట్టు ఉన్నాదట! అది చూడ్డానికి చిన్న అడివిలాగే ఉంటాదట ఒక్కటయినా. ఆ మర్రిచెట్టుకి, పడమటి మూడుకొమ్మలలోను మధ్యదానిలో కొట్టకొసని, ఒక దిట్టమయిన ఊడ ఒక గుహలోనికి పోయిందట! ఆ ఊడంటీపోయి, అది పాతుకున్న చోటికి పోయి, రెండున్నర నిలువులలోతు తవ్వితే, బంగారపు ఇటుకలగని ఉన్నాదట! అది తెచ్చుకోవాలంటే, కాలినడకను అక్కడకు వెళ్ళి, ఒక్కడూ ఇంకొకరి సహాయంలేకుండా ఒక్క గునపముతోనే తవ్వాలట! అలా తెచ్చుకున్న ధనంలో రెండువంతులు గంగలో పారేస్తే, మిగిలిన ఒక్కవంతూ వాడుకుందికి నిలుస్తుందట! లేకపోతే ఆ తెచ్చుకున్నదంతా మన్ను అయిపోతుందట!' అని వెళ్ళిపోయేడు.

అతని ఆ తర్వాత చరిత్ర మనకు అవసరములేదు. ఎందుకంటే అతడు కాశీకావల కొద్దిదూరంలోనే ఉన్న హిమాలయపర్వతం చేరుకొనేలోగానే, ఇంకొక ఉన్నతస్థానం చేరుకోగలిగేడని, నేను చెప్ప నక్కరలేకుండానే మీరు ఊహించుకోగలరు. నేను ఈ కథ చెప్పగానే మీరు ఎందుకిలా నవ్వుకున్నారు? అతని తెలివితక్కువను చూసేనా? అవును, లేకపోతే కాశీకావలే ఎదో ఒక గుడిసెలాగున హిమాలయ పర్వతము ఉండడమేమిటి? ఆ పర్వతముక్రింద మరే మీ లేనట్లు ఒక మర్రిచెట్టు ఉండడమేమిటి? దాని కింద, ఎప్పుడో ఎవ్వరో ఆవముపెట్టినట్లు బంగారపు ఇటికలు దొరకడమేమిటి? ఇదెక్కడయినా సంభవమా? ఇట్టి మనిషి కాలి నడకన అంతదూరమువెళ్ళి, ఒక్కడూ ఆ కొండ జాగాలో రెండునిలువులలోతు తవ్వడమేమిటి? ఇదంతా మరేమీలేదు. ఆ కపట సన్యాసి చేసినమోసం అంటారా? నేనుకాదనను. అది నిజమే. తనపొట్ట గౌరవముగా నింపుకుందికి, ఇట్టి అమాయకులను గోతులలో తొయ్యడమే ఆ కపటసన్యాసి పని.

ఆవిధంగానే మనమూ, మోక్షము, మోక్షమార్గము, బ్రహ్మకైవల్యము అనుకున్నవన్నీ, ఆ బంగారపు ఇటుకలవంటివేనేమో! లేకపోతే ఎవరు చూసేరు? ఎంతో గడుసువాళ్లమనుకుంటున్న మనముగూడా ఆ కోమటిబిడ్డంతటి అమాయకులమేనేమో? అతడు కోమటి బిడ్డగాబట్టి డబ్బుకోసం తాపత్రయపడి అనవసరంగా కష్టపడిపోయేడు. మనము ఈజన్మలోకాక, ఎప్పుడో, ఏనాడో, మనకు అనుభవములేని సౌఖ్యం, ఆనందం కలుగుతుందని నమ్మి వాటికోసం కొట్టుకొనిపోతున్నాం. ఆ సౌఖ్యాలకు మార్గంగూడా అలాంటిదే. ఒక అసత్యమయిన, అభావ్యమయిన స్థలం చేరుకుందికి, ఒక అసంభవమయిన, అశక్యమయిన మార్గముజూపి, అది అనుసరిస్తే ఆ పదవి చేరవచ్చునని చెప్పడము ఏమిటో, వారు అడపా, తడపా వెళ్ళివస్తూఉన్నట్లు. మోక్షమంటే ఈ భౌతిక శారీరాన్ని విడచే శరీరినే విడిచి, ఆత్మ పరమాత్మలో కలుస్తుందట!

ఈ భౌతికశరీరం విడిచిపెట్టిన ప్రాణికి ఒక ప్రత్యేకత ఉంటుందో ఉండదో అనుమానమే. ఈ శరీరమునుండి శరీరినే విడివర్చడానికి తటపటాయిస్తున్నవారు, శరీరినుండి ఆత్మను విడదీయడానికి ఇంకా ఎంత తటపటాయిస్తారో. శరీరంలోని ప్రాణిలోని ఆత్మయొక్క విముక్తే కర్తవ్యమయితే, అందుకు శరీరం నుండి శరీరియొక్క విముక్తే, అంటే మరణమే ప్రథమ సోపానంకాదూ.

మోక్షమనేదే ఉంటే, దానికి వాంఛారహిత జీవితమే ముఖ్యమయినదా? అసలు వాంఛ అంటే ఏమిటి? ప్రపంచకంలో జరిగే ప్రతి క్రియకు ఒక కారణము ఉంటుంది. అది మానవుల విషయంలో కోరిక లేక వాంఛ అందాం. ఈ వాంఛ అనేది లేకపోతే మనిషి గూడా అంత జడజగత్తువలెనే చైతన్యరహితంగా ఉంటాడు. సౌఖ్యపడదామని కదా మనిషి పనిచేస్తున్నాడు. అట్టి సౌఖ్యపడదామన్న దానినే వాంఛ అని, దానిని నిషేధిస్తే, మనిషి పనిచెయ్యవలసిన అవసరమేమిటి? అలాగున తన సౌఖ్యానికికాక, పరసౌఖ్యానికి పాటుపడాలనా? ఇది పైకి ఎంత ధర్మబద్ధంగాను, పారలౌకికంగాను కనుపిస్తుందో, లోపల అంతటి అసందర్భంతోటీ కూడుకుని ఉన్నది. తనకేసౌఖ్యము అవసరము లేనప్పుడు, పరులకు సౌఖ్యమెందుకు? తన సౌఖ్యం కోసం ప్రయత్నించడం తనకు దోషమయినప్పుడు పరుల సౌఖ్యంకోసం పాటుపడడం, ఆ పరులకు దోషము తలపెట్టినట్లుకాదూ?

ఒక ఫలాన్ని కాంక్షించే పనిచేస్తాము. ఫలాన్ని కాంక్షించకుండా ఎవడయినా పని చేస్తున్నాడూ అంటే, అతడు ఆ కర్మకు ప్రత్యక్షఫలాన్నిగాక, పరోక్షమయిన దైవ, మోక్షమనే ఫలాన్ని ఆశిస్తూకూడా తనకు ఎట్టి వాంఛలేనట్లు పరులను మోసగించడమే కాక, తననుతనేమోసగించుకున్నాడన్నమాట! బ్రహ్మకైవల్యం పొందుదామన్నదీ వాంఛే. స్వర్గాన్ని చేరుదామన్నదీ వాంఛే. భూలోకంలో రాజునవుదామన్నదీ వాంఛే. పోనీ ఒక మ్యునిసిపల్ కమిటీకి చైర్మన్ అవుదామన్నదీ వాంఛే. కనీసం తన చేతిలో లేని, భార్యను లోబరచుకొందామన్నదీ వాంఛే. లేక, తనకు ఏమీ చేతకాక, అనవసరములైన అగచాట్లను అనుభవించుకుందికిగాను సునాయాసంగా చనిపోదామన్నదీ వాంఛే, వాంఛాయుతమయినదే జీవితమూ, మరణము కూడా. ఒకటి దోషయుతమయినదయితే, రెండవది గూడ దోషభూయిష్టమయినదే.

ఈ తర్కమంతా మా శర్మముందు ఏకరుపెట్టేసరికి, అతను కొంతసేపు నోరువెళ్లబెట్టి, తన భగవద్గీతా పాండిత్యాన్నంతనీ ఉపయోగించి, 'అహంకార మమకారయుతమైన వాంఛేనోయ్ దోషయుతమైనది' అని సమర్థించబోయేడు. మొదటి కర్మఫలం మోక్షానికి ప్రతిబంధకం అన్నారు. జీవితం అనేదే కర్మతో కూడుకున్నదన్నమీదట, వాంఛారహితమయిన కర్మకు, ఫలానుభవం ఉండదన్నారు. వాంఛకు, కర్మకు ఎంతటి సన్నిహితత్వం ఉందో నిరూపించేసరికి అహంకార మమకారాలు లేనివాంఛ అని మరొక మార్పును తెచ్చిపెట్టేరు. ఈ అహంకార మమకారము లేమిటి? పురాణంచెప్పే పండితులు మాత్రం రాత్రి కడుపు పేరిపోయేటట్లు తిని, ముక్కులోకి మందుగుండు అడపా తడపా దట్టిస్తూ, సేరున్నర పాలనూ ఖాళీచేసి, ఈ అహంకార మమకారాలుమీద చాలా తమాషాగా దాడితీస్తారు. వారికి కావలసినది కాలక్షేపం. నిండవలసినది తమ పొట్ట. ఆ రెండింటికి, తమ శక్తిమీదగాక, పరుల శక్తిమీదనే ఆధారపడాల గనుక, ఏదో ఒక ప్రత్యేక వ్యక్తినికాక, ఎవ్వరికి కనుపడని ఈ అహంకార మమకారాలమీద కారాలు మిరియాలు నూరితే తమపనికి పనా అయిపోతుంది. పైహారికి కావలసిన సత్కాలక్షేపమూ అయిపోతుంది. అహంకారమూ లేక, మమకారమూ లేక ఆ పనులెందుకు? ఆ పనులకోసం జీవించడమెందుకు? సరే, ఇవి మోక్షానికన్నారు కదా? సరే అంటే, ఈ అహంకార మమకారాలతో కూడుకున్న వారు మోక్షానికి అరవై వేలమైళ్ళ దూరంలో ఉన్నట్టేనా? ఒక్కమనిషిని చూపించగలరూ. ఈ రెండూ లేనివాడినిగాని, అందుకోసం జీవిస్తున్నవాణ్ణిగాని? ఒక వాదనని మొండిగా నిలబెట్టడానికి, గాలిలో నిలబడతొనడం భావ్యంకాదు. నేను ఈ లోకంలో, ఇప్పటి ప్రజల కష్టనష్టాలు, మంచిచెడ్డల గూర్చి ఆలోచించి, నా వేదాంతాన్ని ఒక అంతానికి తీసుకురాదలచుకున్నాను.

నేను ఈ విషయంగూర్చి ట్రైనులో ఒక పెద్దమనిషితో, (అతను మాయింటికే పెళ్ళి మాటలకు వస్తున్నాడని నాకేమి తెలుసును!) నా వాగ్ధాటిని, వాక్చమత్కృతిని, తర్కాన్ని ఉపయోగించి, నా గొంతుకకు ఉన్నశక్తినంతనీ వినియోగించి, వాదిస్తూఉంటే, ఇక వేరు ఉపాయం తోచక ఈవిధంగా విజృంభించేడు.

ఏమిటయ్యా నువ్వూ నీ పిచ్చి ఆలోచనలున్నూ, వెర్రా అంటే వెర్రికాదు. తెలివితక్కువా అంటే తెలివితక్కువా కాదు. ఎన్నాళ్లు కూపస్థమండూకంలాగున అలాగే చావుగూర్చి ఆలోచిస్తూ ఉంటావ్, ఒక్కమాటు కళ్లుతెరచి చూడవేమి? నువ్వు ఎంతటి విశాలజగత్తులో ఉన్నావో యోచించుకో. ఎంతటి మహత్తరశక్తులు విశ్వంలో తిరుగుతున్నాయో గ్రహించుకో. ఎంతటి అనంత కాలం గడచిపోతోందో ఆలోచించుకో. అందులో నీకు స్థానం ఏమిటి? నీజీవితం లాంటి ఎన్ని కోటానుకోట్ల జీవితాలుగడుస్తే కంటికి ఆనేపాటిస్థలం ఏర్పడుతుందో గ్రహించుకో. అట్టి ఈ అనంతవిశ్వంలో అనంతకాలంలో ఒక లిప్త గడపడానికి ఎందుకోయ్ అలాగ తటపటాయిస్తావ్' అని ట్రైనాగగానే గబగబా దిగిపోయేడు, అంతటితో శని విరగడయిపోయిందనుకొనీ (నేనూ అక్కడే దిగి అతనితోటే వస్తానని అతనికేమి తెలుసు.)

అతని తర్కం బాగుందికదూ? లోహాన్ని తయారుచేసే ఒక పెద్ద యంత్రశాలలోకి (స్టీల్ మ్యానుఫాక్చరింగ్ కార్పొరేషన్) తీసుకొని వెళ్ళి గోలేలకొద్దీ మరుగుతున్న లోహద్రావకాన్నిచూపి 'చూసేవా అందులో ఎంత వేడి ఉన్నాదో! ఎంత బరువుగల పదార్థమున్నాదో! ఎంతటి మహత్తరశక్తి అందులో నిబిడీకృతమయి ఉన్నాదో!' అనిచెప్పి, అందులో ఒక చెమ్చాడు ద్రావకం తీసి, 'చూడు ఈ చెమ్చాడు ద్రావకం, అందులో ఏమాత్రమయినా పోల్చదగిన పరిమితిలో

ఉందా? ఇందులోని వేడి ఆ వేడిలో ఎన్ని కోట్లవంతో కదా?" అని ఆ చెమ్చాడం ద్రావకాన్ని ఆ అమితమయిన ద్రవపదార్థంతో పోల్చి, 'ఇది నీ గొంతుకలో పోస్తాను నోరుతెరువ్' అంటే 'ఒస్ ఇంతేకదా, అంత టిదాన్లో ఇది ఏపాటి?' అని గుటకవేస్తాడా' వేసిబ్రతుకుతాడా?

ఎంతటి మహత్తరమయిన పదార్థాన్నయినా అంతకంటే ఎన్నోరెట్లు పెద్దదానితో పోలుస్తే, క్షుద్రమయినదిగానే కనుపిస్తుంది. ఎంతటి క్షుద్రమైనదానినయినా అంతకంటే అల్పమైనదానితో పోలిస్తే మహామహిమ కలదిగానే కనుపిస్తుంది. ఒక మహామేరువుతో ఒక ఇటుకబెడ్డను పోలుస్తే, ఆ ఇటుకబెడ్డకు ఎట్టిస్థాన మివ్వడమూ అనుపిస్తుంది. ఆ ఇటుకబెడ్డతోనే ఒక అణువును పోలుస్తే, ఆ బెడ్డే బ్రహ్మాండాన్నంతటినీ నిండిపోయినట్లు కనుపిస్తుంది. ఒక ఏనుగు నడుస్తూఉంటే ఎన్ని కండచీమలు నలిగిపోతున్నాయో! అట్టి కండచీమతో సూక్ష్మజీవుల నొక్కొక్కదానినే పోలుస్తే వాటికేమయినా స్థానముంటుందీ! అట్టిది ఆ సూక్ష్మజీవులుగాని, ఆ కండచీమలుగాని, వాటికి అనంతవిశ్వంలాగునే కనుపిస్తున్న ఆ ఏనుగునుజూచి వైరాగ్యాన్ని చెందిపోగలవూ?

ఎంతటి అల్పజీవిఅయినా వాటికి కావలసిన జీవిత పరిమితి వాటికుంటుంది. అవి తినవలసిన ఆహారం అవి తినాలి. వాటి జీవిత పరిమితి ఉన్నంతకాలం బ్రతకాలీ అంటే, వాటికి కావలసిన ఆహారనివాస సంయోగ సుఖములకోసం తాపత్రయపడాలి. అట్టితాపత్రయం లేనప్పుడు జీవించాలనే ఉండదు, అట్టివాడికి ఈ విశ్వాన్ని చూసినతర్వాత తన ఊహ మరీ బలపడి అతనిని జీవితమునుండి మరింత విరాగిని చేస్తుందిగాని దగ్గరకు లాగుతుందా? ఈ అనంతజడ జగత్తులోను ఏమాత్రమూ విలువలేని ఈ జీవితం ఎంత నిర్భరమైనదయిననూ భరించడమెందుకు? ఆబుడగ పేలిపోగానే కాలమహాసముద్రంలో ఎక్కడున్నదీ తెలియకుండా కలసిపోవలసినదే కదా? అటువంటి మహాసముద్రములో ఆ నీటిబుడగ, 'అయ్యో నేను మిగతా బుడగలంత పెద్దదానిని కాలేకపోయేనని విచారించిగాని, నాఅంత పెద్దబుడగ ఇంక ఈ సముద్రంలో ఎక్కడా లేదుకదా అని కనుచూపుమేర చూచి విర్రవీగినాగాని, ఏమి లాభం! తను మహాసముద్రంలో కలసిపోయినతర్వాత తన వ్యక్తిత్వమేమయినా ఉంటుందా? ఇక్కడ ఒక బుడగ ఉండేదని ఎవ్వరైనా చెప్పగలరా? ఒక అనంతమయిన ప్రవాహంలో కొట్టుకొనిపోతూ, తన అల్పజీవితమునే ఒక మహాయుగంలా చేసుకొని, ఆ మహాసముద్రంలో ఈదలేక ఆ కొట్టుకుపోవడమెందుకు, ఆ కొట్టుకుపోయినందువలన తను గడించేదేమిటి?

ఇవన్నీ ప్రశ్నలే. ఇన్ని ప్రశ్నలు తనను ఎదుర్కొంటున్నా, రోజు గడియడమే మహాకష్టంగా ఉన్న తన జీవితం ఎంతటి సందిగ్ధతతోటి కూడుకున్నా మనిషి జీవిస్తున్నాడు. తిండికి బట్టకు గడచిపోతున్నన్నాళ్లు పేకాటలో ఓడిపోయామనీ, క్రాసువర్డు పజిలు ఒక్క తప్పులో పోయిందనీ, తన క్రొత్త భార్య తనకు తెలియకుండా తనను మోసగిస్తున్నాదేమో ననీ, సిగరెట్లు ఖరీదరుపోయే యనీ సానివీధి ఖాళీఅయిపోయిందనీ, తన కొడుక్కి కట్నాలబజారులో సరైన గిరాకీ రావడం లేదని, ఇనాంభూములు ఎగిరిపోతున్నాయని, ఇదనీ, అదనీ, ఇంకోటనీ, ఈ విధంగా మనోక్షోభతోకొట్టుకుపోతూగూడా జీవిస్తున్నాడు. జీవించకుండా ఉండలేకపోతున్నాడు. తను జీవించడం ఎట్టి విధంగాను లాభదాయకం కాదని తెలుసుకొని గూడా మరచిపోవడానికి ప్రయత్నిస్తున్నాడు. మరచిపోతున్నాడు. మళ్లా మోహాంబుధిలో పడిపోయి బుడగలేస్తున్నాడు. కష్టయుతమయినదయినా, సుఖదాయకమయినదయినా, ఈ జీవితకాలం పొడుగునా జీవించి చేయగలిగేదేమిటి? చేస్తున్నదేమిటి? మనిషి సుఖించడంకోసం బ్రతకడమా? బ్రతుకుతున్నాం కదా అని సుఖంకోసం ప్రయత్నం చేయడమా? ఈ సుఖ దుఃఖాలు ఈ శరీరంతోటే అంతరిస్తాయా? అలాగయితే, సుఖంగా ఉన్న రోజుల్లోనే హాయిగా ప్రాణం వదిలివేయడం భావ్యం కాదూ?

అబ్బే ఇదేమీ కాదు. సుఖంగా ఉన్నవాడు, దుఃఖం అనుభవిస్తున్నవాడు, పదిమందిలో పేరు సంపాదించుకున్నవాడు, నువ్వెవ్వడవని కన్నెత్తిగూడా చూడబడనివాడు, ఆరోగ్యవంతుడు, రోగిష్ఠి, పంచభక్ష్యపరమాన్నాలతో గూడా సంతృప్తి చెందలేనివాడు, పది రోజుల కొక కబళం దొరికినా దొరికిందనే ఉబలాటంతో, కబళానికే కొట్టుకొనిపోయేవాడు, లోకానికి మేలు కూరుస్తున్నాననుకొనే మహామేధావి, తనకు మనుజలోకంలో ఎట్టి స్థానముందో గ్రహించలేని పామరుడు, స్వతంత్రజీవితాన్ని అనుభవించగల్గే పురుషుడూ, తాళ్ళుకప్పలవెనుక అణగిపోయే పతివ్రతామతల్లులు, రాగులు, విరాగులు, త్యాగులు, భోగులు, రోగులు, జోగులు అందరూ ఒక్కలాగునే, జీవించడానికి తాపత్రయపడిపోతున్నారూ అంటే, దానికి వేరే ఒక కారణం ఉన్నాదని చెప్పలేమేమో? జీవించడం ఒకరిని ఉద్ధరించడానికికాదు. తను మరణించడానికి భయపడుతూ ఉండడమువల్లనే...అంతేకాక, తన చావు తరువాత, తను ఈజీవితములో చేసిన తప్పులకు యముని ముందు ఎక్కడ సంజాయిషీ ఇచ్చుకోవాలో అని ఈ జీవితకాలాన్ని పొడిగిద్దామని ప్రయత్నించడంవల్లనే ముఖ్యంగా ఈ కష్టసుఖములనే జాలంలో చిక్కుకొని, రేపటి సంగతే తప్ప తన గమ్యస్థానంగూర్చి ఆలోచించుటకు తగిన అవకాశం కల్గించుకొనకపోవడంవల్లనే తనమీదే, ఈ జగత్తంతా ఆధారపడి ఉన్నాదని మభ్యపడి, 'నేను లేకపోతే వారు ఉండగలరా' అని అనుకోడంవల్లనే (అదేమిటో తనూ, తనవారూ ఉట్టిగట్టుకొని ఊరేగేటట్టు!)—దీనినిబట్టి జీవించడమే దోషంలా కనుపిస్తున్నాది కదూ! మనిషిగాని, ఏ జీవిగాని మరణించడమనేది ఎలాగూ జరుగుతుంది. అందుచేత స్వేచ్ఛగానే, ముందుగా చనిపోవడంలో దోషమేమిటి?

క్షమించండి మిమ్మల్ని విసిగిస్తున్నట్లున్నాను. నా మనస్సునంతటినీ మీకు చూపించాలని నాకు తోచింది. ఇప్పుడు మీరు నాకు విధించబోయే శిక్ష నాకు తెలుసును. అందుచేత ఇంత నిర్భయంగా నా హృదయంలోని సంగతులన్నీ చూపిస్తున్నాను.

(మిగత వచ్చేసంచికలో)

# మరణ సమస్య – సరికొత్త వేదాంతం ★

రచన: సీతారామ శాస్త్రి

"అటువంటి ఊహలతో నా మనస్సు నిండిపోయింది. నిజంగా మనిషి బ్రతకడంవలన, తనకేకాక లోకానికిగూడాఎంతో ద్రోహంచేస్తున్నా డనుపించింది. అట్టి కష్టాల నుండి తప్పుకుందికి 'చావే' అంతిమశరణ్యం అని తెలిసిగూడా ఎందుకో ఆ ఊసేలేకుండా ప్రతీజీవి గడిపివేస్తోందని నాకు తోచింది. అందుచేత ఆబాధ్యత నామీదపడినట్లు నేను అనుకున్నాను. దేవుడు నన్ను అందుకే పంపించినాడని నానమ్మకం. ఇప్పటికీ నమ్ముతున్నాను. మీరు ఉరిశిక్షవేసి నన్ను అంతమొనర్పవచ్చుగాని, నాకర్తవ్యం దైవచోదితమయినదయితే మరొకడు నావంటివాడు పుట్టకపోడు.

"సరే, ఎప్పుడయితే నా ఊహలను అమలులో పెట్టడం నా కర్తవ్య మనుకున్నానో, వెంటనే పని ప్రారంభించేను. ఒకరిని కష్టపెట్టడం నా ఉద్దేశ్యముకాదు. కష్టాలనుండి తప్పించడమే, కష్టపెట్టే వారిని అంతమొనరించడమే. నా మొదటి ప్రయోగంకోసం నేను వెదుకుతూఉంటే, ఊరిబయట కాలువ దగ్గర ఒక ముష్టిది కనుపించింది. చింపిరి జుత్తుతో రోడ్డుతుడిచిన తుండుగుడ్డ కట్టుకొని, ఒక చింకిచాపమీద, చెట్టువార కూర్చొని, ప్రక్కన అక్కడక్కడ ఏరితెచ్చిన పుడకలతో మంటబెట్టి, ఒక పగిలిన కుండపెంకులో అన్నిరకాల గింజలూ ఉడికిస్తోంది. ఎన్ని రోజులనుండి జీవిస్తోందో, ఎన్నిరోజులు ఆ విధంగా జీవిస్తోందో! భగవంతుడు అనేవాడుఉంటే, ఈ జీవిని ఇంతటి హీనస్థితిలో నిలపడంలో అతని ఉద్దేశ్యమేమిటి? దగ్గరనే ఉన్ననదీ నిర్మలోదకంలో ఒక్కమాటయినా మునిగిపోయి కళ్ళుమూద్దామనే వాంఛ ఆమెకు ఎందుకు కలిగించకపోవాలి? ఆమె సుఖంగానే ఉందా? చనిపోతే ఎవరికి మాత్రం నష్టమేమిటి? ఆమె నీళ్ళ కోసం మరొక రేకుడొక్కు పట్టుకొని కాలువదగ్గరకు వెళ్ళింది. ఈ పిడికెడుముద్ద, ఆ పురిపెడినీళ్ళు కడుపులో పోసికొని, అర్ధాకలితో, ఎండా, చలి, లేక అష్టకష్టాలు పడిపోతున్న ఆమెను ఉద్ధరించడం నా విధి అనుకున్నా. వెనకపాటుగా, రెండు బుజాలూ పట్టుకొని గభీమని లోపలికి తోసేసేను. ఆ ప్రవాహంలో ఒక ఎంగిలాకులాగ కొట్టుకుపోయింది. రెండుమూడుసార్లు అడుగుచూసి, ఆ కాలువ ఆకాశంలో కలిసేచోటికి వెళ్ళిపోయింది. అరె, అలాచూస్తారేం! నేను చేసినపని మీకంత అమానుషంగా కనుపించిందేం? అవును, ఒక మనిషిని చంపడం, ఒక నిండు ప్రాణాన్ని తియ్యడం ఘోరాతిఘోరం అనికదూ మీ ఉద్దేశ్యం? ఆమె 'మనిషి' అనే మీరు అంటారా? అలా అని ఆమెకు ఒక పంచ ఎవ్వరేనా చూపేరా పండుకుందికి. ఒక గోనెగుడ్డ పరుచుకుందికి దానంచేసేరా? ఒక పిడికెడు బియ్యం వండుకుందికి జోలెలో పోసేరా? అప్పుడది మనిషే కాదు. తోటలో స్నేహితులతో, స్నేహితురాండ్రతో సాయంకాలంపూట టీ తాగుతున్నప్పుడు అల్లంత దూరాన్న అల్లాడిపోతున్న మేనుతో— "బాబూ ఆకలి" అని అస్తే మీరు భయపడిపోరూ! ఒక దెయ్యాన్నిచూసినట్లు అదిరిపోరూ! అక్కడి కోమలాంగులు ఎక్కడ మూర్ఛపోతారో అని. చెంచేలెత్తిపోరూ? ఆమె ఒక రాక్షసి. ఏనాటిక్రిందనో చనిపోయిన దయ్యం. ఆవిధంగా మీకుగోచరిస్తుంది. ఆమె ఆ విధంగానేఉంది. అలాగే ఎందుకో ఇంకా ఆతొక్కపట్టుకొని వ్రేలాడుదామనుకుంది. ఆమెకు చచ్చిపోయేపాటి ధైర్యం లేకపోయింది. అందుచేత నేనాపని చేసేను. ఆమె నిండుప్రాణం తీసేనని మీరు అననక్కరలేదు. ఆమె ప్రాణం ఏనాడో లేచిపోయింది. ఇప్పుడు నేను ఆమె శరీరాన్నే తోసివేసేను. ఒకవేళ ఇంకా ఆమె ఉండేఉంటే ఎక్కడో కులాసాగా కులుకుతూ ఉంటుంది.

"ఆమె నదీప్రవాహంలో కొట్టుకుపోయింది. ఎక్కడో పడవలోని సారంగు హాయిగా పాడుతున్నాడు. చెట్లమీదపక్షులు కిలకిల అరుస్తున్నాయి. దూరాన జట్కా బడబడలు ఎంతో స్పష్టంగా వినిపిస్తున్నాయి. ఊళ్ళో విద్యుద్దీపాలు ఒక్కమాటు వెలిగేయి. ఎవరో కొందరు కోమటిబిడ్డలు తమకువచ్చిన లాభాలగూర్చి కేరింతలుకొడుతూ ఊళ్ళోకి పోతున్నారు. చల్లని మందమారుతం చెట్ల ఆకుల్ని కదలించి, ఆ సువాసనను ఊళ్ళోకి తీసుకొనిపోతోంది. చెట్టు క్రింది మంట నుసిలో అణిగిపోయింది. ఆమెకోసం ఎవ్వరూగూడ విచారించినట్లే లేదు. ఎవ్వరికి గూడ 'ఆమె' అనే ఒకజీవి ఉన్నట్టే తెలీదు. ఎవరికైనా ఆమెశవము దొరికిఉంటే. ఎన్ని గవర్నమెంటు పుస్తకాలు వెదికినా, అది ఫలానా వ్యక్తి శరీరమని ఏమాత్రమూ ఆధారం దొరకదు. ఎవ్వరికిగూడా ఆమె పోయినందువలన నష్టం కనుపించలేదు. ఆహా! ఎట్టి జీవితం! ఇట్టి ప్రపంచకంలో, తనతో కించిత్తయినా సంబంధం పెట్టుకొనని లోకంలో, ఆమె ఎవరికోసం బ్రతికింది ఇన్నాళ్ళూ! ఎందుకు కష్టాలలో కొట్టుకుపోయింది? ఆ కష్టాలు ఇంత సునాయాసంగా గట్టెక్కిపోగలవని తెలుస్తే ఏనాడో తన ప్రాణాలు ఇచ్చేసును గదా!

"ఆ పని చేసినతర్వాత నాకెంతో హాయి కనుపించింది. ఈ ప్రపంచంలోనున్న కష్టజీవులకు సౌఖ్యం కూర్చేందుకు నే పూనుకున్నందుకు ఎంతో గర్వించేను. ఊళ్లోకివెళ్ళి అయ్యరు హోటలులో భోజనం చేసేను. పోయి గదిలో పడుక్కుందామనుకున్నాగాని, ఎందుకో నాకు వెళ్ళాలనుపించలేదు. మళ్ళా కాలువవద్దకు వచ్చేను. దూరాన్న ఎక్కడో ఒక మంట స్మశానంలో కనుపిస్తున్నాది. ఆ ప్రక్కనుండి నక్కలు కూస్తున్నాయి. కాలువమీంచి వీచేగాలి నాకెంతోఆనందాన్ని కూరుస్తున్నాది. ఆహా, ఇంతటి సౌందర్యవంతమయిన ప్రకృతిలో ఈ నిర్మలోదకం చల్లచల్లగా, మెల్లమెల్లగా పారుతూ ఎంతో నిండుగాఉంటే, ఈ పండువెన్నెట్లో హాయి

గా అందులో మునిగిపోవాలని ఎందుకుండదు! ఈ లోకంలో ఎందుకు ఇంకా 'బ్రతుకు, బ్రతుకు' అని కొట్టుకుపోతారు? ఇంతటి ఆనందకరమయిన చావు ఎవరికి వస్తుంది. నా మట్టుకు నాకు ఆ కాలువలోకి దూకీయాలనుపించింది. నీటిలోని కలువపువ్వు నన్నెంతో ప్రేమతో పిలుస్తోంది. ఒకచేప ఎగిరి-'రావేం ఇంచక్కా ఆడుకుందాం'అని ఆహ్వానిస్తోంది. అందులో సుఖంగా లోతుదాకా ప్రయాణం చేసి, ఆ చల్లటినీరు కడుపునిండా త్రాగి, తెలివిరాకుండా నిద్దురపోవాలనేఉంది నాకు. కాని, నా పనో? నేను పూనుకున్న పని ఏమవుతుంది?

"ఆలాగే కూర్చున్నాను ఆలోచిస్తూ. ఏవో అడుగుల చప్పుడు వినిపించింది. ఎవరో వస్తున్నారని నేను చెట్టువార నిలుచున్నాను. ఇంతలో ఒక పాతికేళ్ళ యువకుడు, ఒక ఇరవై ఏళ్ల అమ్మాయి వస్తున్నారు. ఆ అమ్మాయి నాకు తెలుసును. కాలేజీలో చదువుతోంది. ఆమెకు పదహారోఏట ఇష్టంలేని పెళ్ళిచేసేరు. ఏడాది తర్వాత మొగుడు పోయేడు. ఆమె యింకా చదువుతోంది. ఇతనుగూడా ఆమె కాలేజీలో కుర్రాడేగామోసు. పరకాయించి చూసేను. అవును. మోహనరావు! నా క్లాసుమేటే! ఇంకా కాలేజీలోనే చదువుతున్నాడు. నేను కుతూహలంగా చూస్తున్నాను.

"ఇద్దరూ కాలువగట్టుమీద కాలువవేపు తిరిగి కూర్చున్నారు. ఆ పిల్ల మోహన్‌రావు ఒళ్ళోకి వాలి, అతని రెండు బుజాలు పట్టుకొని, అతని కళ్ళలోకిచూస్తూ తన తల అతని వక్షానికి ఆనించి అంది-'ఎన్నాళ్ళిలా దొంగతనం మోహన్! ఎన్నాళ్ళు మనం లోకానికి భయపడి బ్రతకడం!' 'ఏంచెయ్యమంటావ్ పద్మా! నిన్నువిడిచి నేను బ్రతకలేను. పోనీ నిన్ను పెండ్లిచేసుకుందామంటే, ఇంకా నేను స్వతంత్రుణ్ణి కాలేదాయెను. నా చదువుకి, దానికి ఇంకా మాతండ్రిగారిమీదనే ఆధారపడాలి. ఈ ఒక్క సంవత్సరం గడచిపోతే, ఇంక మనం ఏమిచేసినా భయంలేదు పద్మా' అన్నాడు మోహన్. ఆమె తల నిమురుతూ—'అమ్మో ఒక్కసంవత్సరమే' అంది పద్మ—'ఇంకెంతపద్మా ఆరు నెలలేకదా?' 'అవును మోహన్, నీకు ఆరునెలలుగానే ఉంటుంది. నేను అంతకాలం బ్రతకగలనా? అందులోకీ ఈ అవస్థలో'—'భయపడక పద్మా, రోజూ మనం ఇక్కడ కలుసుకుంటూ ఉందాం. ఒక్క ఆరునెలలకోసం జీవితమంతా పాడుచేసుకుంటామా.' 'అవును నాకోసం నువ్వు జీవితం పాడుచేసుకుంటావా? కావలస్తే నా జీవితం పాడుచేస్తావుగాని; మోహన్ ఇంతదయ లేదేమి? నేను రేపటినుండీ కాలేజీ కెలా వెళ్ళగలను' అని వెక్కివెక్కి ఏడ్వ మొదలుపెట్టింది. 'అయ్యో, అదేమిటిపద్మా, ఏమిటయింది. అంతకోపమేంచెప్పవూ?' అని బ్రతిమాలేడు మోహన్. 'కోపందేనికి. ఎవరిమీద నాకోపం? నేను అనాధను. నన్ను నా అనువుచూసుకొని నీ యిష్టమొచ్చినట్లు ఉపయోగించుకున్నావు. ఇంకో ఆరునెలలలో నాకొక కొడుకు పుడతాడు, అప్పుడు నువ్వు కనుపిస్తావా మోహన్.' 'కొడుకా? అయ్యో, ఎంతపని జరిగిపోయింది పద్మా. మనం అనుకోలేదు' 'అవును ఎలాగనుకుంటాం. అంతానాదిపూచీ, నిన్ను ఈ నెలలోగా పెళ్ళి చేసుకుంటానని నమ్మించి నాలుగు నెలలు గడిపేవు. ఇప్పుడు నన్ను గోతిలో త్రోయ దలచుకున్నావు—' 'పోనీ డాక్టరు—' 'ఛీ ఛీ నీకు సిగ్గులేదు ఆ మాట అనడానికి—అంతకంటే నన్ను ఈ కాలువలో త్రోసి, ఆ పుణ్యం కట్టుకోకూడదూ?' మోహన్ కళ్ళంటనీరు కార్చడం మొదలు పెట్టేడు. దుఃఖం ఆపుకోలేకపోతున్నాడు. 'పద్మా, నేనంటే నీకంత కోపం ఎందుకూ, నువ్వు చెప్పిన విధంగా చెయ్యలేను. నీకోసం హాస్టలులో వసతి మార్చుకున్నా. నీ కోసం నా సర్వస్వం ఇవ్వదలచుకున్నా. నీ కోసం, మా తల్లిదండ్రులతో కూడా వైరంతెచ్చుకున్నా. పద్మా. నువ్వంటున్న మాటలు నన్నెంత పొడుచుకుంటున్నాయో ఊహించేవా? ఇంతటి ప్రేమతో చూసుకుంటున్న నువ్వు ఎలాఅలాంటి మాటలు అనగలుగుతున్నావ్ పద్మా. నీ కోసం నా ప్రాణాలనయినా ఇవ్వడానికి తయారుగా ఉన్నాను. కావలసివస్తే ఈ కాలువలోదిగి హాయిగా మరణిస్తాను. ఏం చెప్పు, నా ప్రాణాలు నీకు కావాలా.' అని లేవబోతున్న వాడిని పట్టుకొని, గట్టిగా కావలించుకొని పద్మ మరీమరీ వెక్కివెక్కి ఏడుస్తోంది. 'మోహన్, నా మోహన్, ఎందుకంతకోపం. నన్ను రెండోమాటు విధవను చేస్తేగాని నీకు మనసొప్పదా? నాచేతకానితనంలో అన్నమాటలకంత కోపంతెచ్చుకొని, నన్ను నట్టడవిలో వదిలేస్తావా. నామీద జాలిలేదు.నన్ను క్షమించలేవు, అని అంది. పద్మా మోహనులు ఒకరినొకరు కౌగలించుకొని అలా దుఃఖిస్తున్నారు. ఆహా, యవ్వన మాహాత్యం వారిద్దరనూ అంత దగ్గరకు లాగింది ఏమిటి? వారి యవ్వనమేనా, వారి సౌందర్యమేనా, ఒకరి కౌగిలిలో ఒకరెలా కరిగిపోతున్నారో. ఎంతలా దుఃఖిస్తున్నారు. పాపం. తెల్లవారిన తరువాత వారి కెంతటి కష్టముందోకదా. మర్నాడు పద్మ గర్భంవిషయం పాక్కిపోతుంది. అంతతో ఆమె భవిష్యత్తు సున్న. దానికి కారకుడు మోహన్ అని తెలుస్తుంది. అంతతో అతని చదువు పూర్తి. ఆమె గౌరవంలేక, ఇల్లులేక, వాకిలిలేక, ఎక్కడెక్కడో తిరుగుతుంది పిచ్చెత్తిపోయి. వెనకాల పిల్లకాయలు కేరింతలుకొడుతూ వెక్కిరిస్తూ రాళ్ళు రువ్వుతుంటారు. ఎవ్వరింటికివెళ్లి చెయ్యిజాచినా, 'ముష్టిముండవి నీకింత కడుపు ఏమిటే' అని వెక్కిరిస్తారు. తన పాపఫలంగా పుట్టబోయే కొడుక్కి తగినపాలు, తగినప్రక్క ఉంటుందా. ఆహా ఎట్టి చిక్కులు పడాలి పద్మ ముందు ముందు...ఇప్పుడు అతని ఒడిలో తలదూర్చి ఏడుస్తున్న పద్మకి తన ముందుపాట్లు తెలుస్తయ్యా. అప్పుడీ మోహనుడు ఉద్ధరిస్తాడా. (మగవారి సంగతి నాకు తెలీదూ!) ఈఅందం ఉన్నంతవరకే ఈ తీపి. ఆ తర్వాత పద్మ గూడా ఒక ముష్టిదే. అతనికిమాత్రం దిక్కేది? తండ్రి డబ్బు పంపించకపోతే స్కూలులేదు. చదువూలేదు. తనుగూడా కూలిపనికి పూనుకోవాలి. అటువంటి పర్యవసానంలోనికే ఇద్దరూ పరిగెడుతున్నారు. ఇప్పుడు ఈ రంగురంగుల దుస్తులలో, సౌందర్యలతలలా ఉన్న ఈ ఇద్దరు వ్యక్తులూ, ఈరాత్రి దాటగానే, ఆపరిస్థితులలోకి మారిపోతారాని ఆహా! కాల వైపరీత్యం ఎంతలో ఎంత మార్పు తెస్తుంది!

వారిద్దరివైపూ చూసేను, అకస్మాత్తుగా రెండు అస్థిపంజరాలు ఒకదానికొకటి పెనవేసికొన్నట్లు కనుపించేయి. ఒకదాని కొకటి చుట్టుకొనిపోయి, ఒకదానినుంచి ఒకటి జారిపోతున్నట్లు తోచింది. అవును. లోపల అవి అస్థిపంజరాలే. ఆపై తొక్కయొక్క సౌందర్యానికే కదా వారిద్దరూ అంతలాగున కొట్టుకొనిపోతున్నది. నాకు కనుపించినట్లు అందులో ఏ ఒక్కరికిగాని ఆలోపలి నిజస్వరూపం కనుపించి ఉంటే అలా పెన వైచికొని ఉంటారా. ఎంతటి మోహంలో ఉన్నారు! ఎట్టి ఆనందంకోసం ప్రాకులాడుతున్నారు? అయినా వారికదే ఆనందంగా ఉంది. అలా ఒకరియొడిలో ఒకరు అనవరతము ఉండిపోతే వారికి ఇంక ఈ ప్రపంచపు ఊసే ఉండదు. ఈరాత్రి తెల్లవారకుండా ఉంటే వారు హాయిగా ఒకరి హృదయానికి ఒకరు ఆనుకొని, నిద్రపోయి ఆనందంగా గడిపివేతురు కదా! కాని, తెల్లవారక తప్పదు. తెల్లవారిన తర్వాత వారి నిజస్థితి తెలియక మానదు. అంతటి కష్టమురాకుండా చేసుకోలేరూ7 చేసుకోగలరు. కాని, వారంతట వారాపని చేసుకోలేరు. నేను వారి కా ఆనందం శాశ్వతంగా ఉండేటట్లు చెయ్యగలను. ఇట్టి ఆనందం అనుభవించిన తర్వాత, మళ్లా అట్టి కష్టాలు పడవలసిన అవసరం లేకుండా చెయ్యగలను. అది నాశక్తిలోనే ఉంది.

ఇక నేను ఆగలేకపోయేను. వారి భవిష్యత్తు నాకళ్ళకు గట్టినట్లు కనిపిస్తోంది. లేత గులాబీరంగులో ఉండి, తెల్లటిచీర, నల్లటి జాకట్టు తొడుక్కొని, మోహనుని ఒడిలో లేడిపిల్లలా ఒదిగిపోయిన పద్మ, ఎక్కడో ఊరిబయట బురదగుంట ప్రక్కన, నీడలేని చెట్టుక్రింద బుగ్గిలో దొర్లుతూ, చూసేదిక్కులేక, నొప్పులుపడుతూంటే పరిస్థితిని ఊహించలేకపోయేను. ఎంతటి ఆడదాన్నయినా తనవైపు లాక్కొనే అందముండి, అందుకు తగిన చదువుండి, అన్నింటికీ మించిన ఆనందంలో మునుకుతున్న ఈ మోహను ఏ ఫేక్టరీలోనో, ఏకూలిపనో చేసుకుంటూండడమో లేక ఈ కష్టాలకు కదిలిపోయి, పిచ్చివాడయి గోళ్ల మీద దొర్లడమును నేను భరించలేకపోయేను. ఎదురుగుండా పద్మా మోహనులు తమ దుఃఖంలోనే ఆనందం అనుభవిస్తూ, ఒకరిలో ఒకరు లీనమయిపోయి ప్రపంచాన్నే మరిచిపోయి ఉన్నారు. ఇంతటి ఆనందమయులకు అట్టి కష్టాలా?

“వారి ఆనందానికి అంతరాయంరాకుండా నెమ్మదిగా చెట్టువారనుండి వచ్చేను. తెలియకుండా దగ్గర చేరేను. అక్కడకీ ఆకులు నలిగిన చప్పుడయింది కాని, ఆ తన్మయత్వంలో వారికా చప్పుడు వినుపిస్తుందా? మరొక వ్యక్తి వారికంత సన్నిహితంగా ఉన్నట్లు వారు ఊహించగలరా? మరుక్షణంలో వారు స్వర్గద్వారం ముందు నిలబడబోతున్నట్లు అనుకోగలరా? ఆహా, చావు! ఎంతటి మధురమైనది! ఎంతటి వాంఛనీయమయినది! మనిషి జీవితానికి చావు అనే తెర నొకదానిని కల్పించడంలోనే దేవుని సృష్టి వైచిత్ర్యాన్ని పొగడాలి. మరేమీ ఆలస్యంచెయ్యకుండా, ఇద్దరినీ ఒక్కమాటు రెండు చేతులతోటీ ఎత్తి నీట్లోకి విసిరవేసేను. నాకు ఇద్దరిని ఎత్తేపాటి బలం ఎక్కడినుండి వచ్చిందో అర్థంకాలేదు. రెండు పూబంతులలాగున తేలికగా తోచేరు. నేను విసిరిన విసురుకి కాలువ మధ్యలో పడ్డారు. అల్లాగే ఒకరి కౌగిలి ఒకరు విడవకుండా, రెండుమాట్లు మునిగేరు. మూడో మాటు మునిగి ఎక్కడో తేలేరు. నాకు కనుపించినంతదూరం చూసేను. పూలమాలలలాగున జంటపడవలతీరున, చేపదంపతుల్లాగ, ఇద్దరూ ఒకరి నొకరు ఆనుకొని ఆనదీవేగంలో కొట్టుకొని అనంతంలో కలిసిపోయేరు. ఎక్కడనో ఎవరికంటనో పడ్డారు. ఎవరో పైకి తీసేరు. మరునాడు ప్రతిపత్రికలోనూ, తాటికాయ అంత అక్షరాలతోటి ‘ప్రేమజీవుల ఆనంద మరణం’ అని వారికథ పడింది. వారి ప్రేమకు అంతరాయం కల్గించదలచుకున్న సంఘాన్నే వారు విడచి స్వర్గాన్ని చేరుకున్నారని వారి త్యాగాన్ని పొగిడి, సంఘాన్ని దూషించి, తమ గొప్పదనాన్ని చూబెట్టుకున్నాయి పత్రికలు. కానిలోగుట్టు వారి కేం తెలుసును. ఆవిధంగా నేను వారిని అనంతంలోకి నెట్టివేయకపోతే, ఆ పేపర్లే మరునాడు వారిని ‘కామదాసులని’ ‘వ్యభిచారులని’ ‘యవ్వనమదోన్మత్తులని’ నిందించి, వారిని పశువులకంటే నీచంగా నిరూపిస్తాయి.

అవును ఈ హత్యలన్నీ నేను చేసినవే మీకు తెలియకపోవచ్చును నాకు భయంలేదు. ఈపనులు వారి సౌఖ్యంకోసమే చేసేనని నా ఉద్దేశ్యం. ఇంతమందిని చంపినా మీకు తెలిసిందికాదు. అవును ఎలా తెలుస్తుంది? అసలు చాలామంది మనుష్యులు ఎవరివల్లనో ఒకరి వలన చనిపోవలసినదే. చాలామందిని డాక్టర్లు చంపుతారు. కొంతమందిని లాయర్లు దాటిస్తారు. కొందరిని వాహనులు నెట్టేస్తారు. కొంతమందిని కొడుకులే తప్పిస్తారు. మరి కొందరిని అప్పులవాళ్లు, చోరులు, వ్యభిచారిణులు మొదలయినవారు పంపించివేస్తారు. ఏ కొద్దిమందిమీదనో రోగాలు బ్రతుకుతున్నాయి. ఇన్ని హత్యలు పైకివస్తున్నాయా? ఏదో విధంగా మరణం వస్తున్నాదని సంతోషించకుండా ఈ శాసనా లెందుకో!

(మిగత వచ్చేసంచికలో)



# మరణ సమస్య – సరికొత్త వేదాంతం ★

రచన: సీతారామ శాస్త్రి

౭

"సరే, ఆరోజుతో ఆపనులు ముగించి, ఇంటికి వచ్చి పడుక్కున్నాను మరు నాటిపనికి కార్యక్రమం ఏర్పరచుకుంటూ. గోడమీద బల్లి ఏమీ ఎరగనిదానివలె ఉండి ఉండి, దగ్గరకువచ్చిన బొద్దెంకలను, ఈగలను పొట్టబెట్టుకుంటోంది. గదిమూల ఒక సాలె పురుగు ఎవరికోసమో ఇల్లుకట్టేస్తోంది. పెరటి గుమ్మంలో పిల్లి కూర్చొని బీరువాక్రిందికి చూస్తోంది దేనికోసమో. కిటికీలోంచి కను పించే ఎలక్ట్రిక్కుతీగెలకి అప్పుడె ఒక ఋషి పక్షి తగులుకొని గిలగిల కొట్టుకుంటోంది. దొడ్లో ఎక్కడో గుడ్లగూబ అరుస్తోంది. ఆహా! ప్రపంచంలో ఎన్ని మారణయంత్రాలు సృష్టించేడు భగవంతుడు! అవిగాక, మాన వుడు తన తెలివితేటలన్నీ ఉపయోగించి మరి కొన్ని సృష్టించుకున్నాడు. ఇన్నివిధాల ఇన్ని యంత్రాలు పనిచేసి, రోజుకి ఎన్నోకోట్ల ప్రాణుల్ని మంట పెడుతున్నా, ఇంకా కోటానుకోట్లు జీవులు పుడుతూనేఉన్నాయి. జంతువులను చంపడానికి మనిషికి అధికార మిచ్చేడు దేవుడు. మనుష్యుల్ని చంపుకుందికి మనిషే అధికారమేర్పరచుకొని, యంత్రాలు నిర్మించుకుంటున్నాడు. అప్పటికీ అంతము కాక అతని పనికి సహాయంగా నన్ను గూడా ప్రేరేపించేడు.

మరునాడు లేచి బజారువీధివెంట ఏమీ తోచక వెల్తున్నాను. ఎందుకయినా పనికి వస్తుందని, ఒకబాకు, ఎప్పుడో నేను కొన్నదే తీసి, దారుపట్టి మొలలో పెట్టుకున్నాను. మీరెందుకలా భయపడతారు? ఇందులో ఎంతమంది మాంసభక్షకులు లేరు! మేకలను చంపకుండానే మాంసం తినగలుగుతున్నారా వారు. వీధిలో తిరిగే కుక్కలను నిర్దాక్షిణ్య ముగా మునిసిపాలిటీవారు చంపించివేయడము లేదూ? వీటన్నింటికీ మీరు భయపడరేమి? ఇవి హత్యలే కావా? నేను చేసినపనే దారుణ మయినదా? ఏమి న్యాయం? జంతువులది ప్రాణం కాదు. అయినా ఇప్పుడా విషయ మెందుకు? ఈలోకంలో మనుష్యులు జీవిస్తూ అనవసరమయిన తాపత్రయాలలో కొట్టుకు పోవడం నాకు గిట్టలేదు. ఇంతటి బాధను పొందుతూ ఆచావుకి వీరు భయపడడంలో ఏమీ ఉద్దేశ్యం కనపడలేదు. అందుచేత నాకు చేతనయినంతమందికి ఈ బంధ విముక్తి చేయదలచుకున్నాను. నేను ఈపని పెట్టు కొనకపోయినట్లయితే, ఏనాడో హాయిగా కాలువ అడుగున పండుకొని ఉందును.

ఆవిధంగా బాకును మొలలో పెట్టుకొని బజారువీధివెంట వెల్తున్నాను. ఆరోజు ఆది వారం. ఒకమేడముందు ఇరవైమందిలా ముష్టి వాళ్లు నిలుచున్నారు. అప్పుడే కొట్టుతెరచి, లోపల ఒక పోతవిగ్రహంలాగున్న కోమటి సరుకు చూసుకొని అంతా సర్దుకుంటున్నాడు. ఆతనికి తీసిపోని శరీరంగల మరొక కోమటి యీ ముష్టివాళ్లను తరిమి కొడుతున్నాడు. వాళ్ళు అతిదీనంగా ఆదెబ్బలుతింటూ గూడా ఆ డబ్బుమీద మోహం కొద్దీ అందులో ఒక కానీఅయినా ఇవ్వడా అన్న ఆశ కొద్దీ అక్కడ వ్రేలాడుతున్నాడు. నా కెందుకో ఆదృశ్యం చూసేసరికి జాలివేసింది. ఆ నాల్గం తస్తులమేడలో ఆ కోమటి, అతని పెళ్లామే ఉన్నారు. పిల్ల, జెల్ల లేరు. మేడనిండా సామాను, బీరువాలనిండా వెండి సామగ్రి. ఏమిటి చేసుకుంటాడిదంతా? తను తిన్నాడు కడుపుపట్టినంత తిన్నాడు. అప్పటికీ పట్టక పోవడంవల్ల, రెండింతలు కడుపు పెంచేడు. ఒళ్ళు పర్వతంలా ఉన్నది. అతనిని చూస్తే, ఈమనిషికి ఊపిరి తిరుగుతుందా అనిపిస్తుంది. అతని భార్యకూడా అతనితో తులతూగవల సిందే. ఒంటిన రెండు మణుగుల బంగారం ఉంది. అందుచేత ఆమెకు ఆ మేడే ఖైదు. ఇంతటిమేడలో వారిద్దరూ ఉంటే బావురు మనిపించదూ? అందులోకీ, ఆకోమటి దుకా ణము వదలి రెండో గదిలోకి గూడా వెళ్ళ గలడా. అతనికి రాత్రి నిద్దరపట్టదు. పగలు సౌఖ్యం ఉండదు. ఎప్పుడూ...డబ్బు... వడ్డీ...లాభం...ఇదే గోల! ప్రక్కవీధిలో ఏమిటి జరుగుతుందో తెలుసునా? యుద్ధ మెందుకు పుట్టిందో ఎరుగునా? దేవుడిగురించి ఎప్పుడేనా ఆలోచించేడా? చావు అనేది ఒకటి ఉన్నాదని ఎప్పుడేనా అనుకున్నాడా? అబ్బే అతనికి డబ్బుతోనే ప్రసక్తి - ఆడబ్బు ఒక నిలివెడిపోకపోసి, అందులో అతనిని కప్పెడితే అప్పటికేనా సంతుష్టి ఉంటుం దేమో! ఒంటికి బియ్యపు అన్నమే పడుతుంది గాని, లేకపోతే రూపాయికాసులే మింగీ సునుగామోసు. అంతటి డబ్బు ఉన్నప్పుడు ఈ ముష్టివారికి ఏదో కొంత ఇవ్వకూడదు. ఇంతమంది కడుపులమాడ్చి, తను అనుభవించ లేక, ఒకమూల ఈడబ్బు పోయడ మెందుకు?

ఈ మనిషి లోకంలో ఎందుకు ఉన్నాడో తెలియలేదు. ఇతను లేకపోతే లోకానికి ఏమిటి నష్టమో నాకు తోచిందికాదు. ఈ ఒక్కజీవి పోతే, ఆడబ్బు ఒక పదిమంది తింటారు కదా అనుపించింది. ఇతనికి ఈడబ్బు తాపత్రయమువలన మానసికక్షోభ పోవడానికి మార్గం ఒకటే కనుబించింది. అదే చావు— ఆ మార్గాన్ని అతను చూస్తూ చూస్తూ అవ లంబించగలడా. ఏమిటో సౌఖ్యమున్నాదను కొని ఆడబ్బుకోసం దేవులాడిపోతూ తన ఆశకు అంతులేక, సముద్రంలోమునిగిపోతున్న నావలాగున పగలు రాత్రి వడ్డీలెక్కలలోను, లాభ నష్టాలలోను మునుకలువేస్తూ, ఎందుకా బ్రతుకు? ఆడబ్బు ఏమిటి చేస్తాడు. తను చనిపోయినప్పుడు ఆ ఎనుబోతులాంటి శరీ రాన్ని కర్రల కప్పగించవలసినదే కదా? ఎందుకా తాపత్రయం...ఎందుకా పొంగి పోవడం...కాసు పోయిందని ఎందుకా ఏడుపు? హాయిగా చచ్చి పోకూడదూ? ఎందుకో ఆమనిషి డబ్బుకోసం కొట్టుకు

షోడం నేను చూడలేకపోయేను. అలాగే మెట్లు ఎక్కి, బొక్కి కళ్ళజోడులోంచి, ఏదో చిట్టా చూస్తున్న అతని తలను అలాగే అణిచిపెట్టి, మొలలోని కత్తితీసి, అతను ఏమిటవుతుందో ఊహించుకొనే లోపల మెడమీంచి సత్తువకొద్దీ పొడిచేను. దాని కొస పీకక్రిందనుండి పైకి వచ్చింది. రక్తం చిమ్మిన గొట్టంలోంచి వచ్చినట్లు నా ముఖంమీద, అతని పుస్తకాలమీద, అక్కడ నిలుచున్న వారిమీద తుళ్లింది. ఆ కోమటి మరోమాట లేకుండా అలాగే ఒరిగిపోయేడు. అక్కడ ఉన్నవారందరూ ఒక్కమాటు గగ్గోలెత్తేరు. కాని ఒక్కరూ నాదగ్గరకు వస్తేనా? నేను నాకత్తిని మళ్లా లాక్కొని, చొక్కాతో తుడుస్తూ మెట్లుదిగేను. ఎంతటిమేడ కట్టించేడు. ఎంతటి బంగారం కొన్నాడు! ఎంత మంది పొట్టలుకొట్టి భోషాణాలు నింపేడు? ఇప్పుడా డబ్బు అతనికి సాయం చేస్తుందా? అంతెందుకు? బస్తాను నింపినట్టు నింపేడే ఆ శరీరాన్ని. ఇప్పుడేదీ! ఇంతమందిని ఏడ్పించిన ఆవ్యక్తి ఎక్కడకు పోయేడు. నాకుమాత్రం మహా ఆనందమయింది. నాకు కలిగిన ఊహాలు అక్కడున్నవారికి కలిగిఉంటే, వారలా చెంచేలెత్తిపోతారా? ఈజీవితనరకంనుండి, చావు అనేదే పైకిపోవడానికి మార్గమని వీరెందుకు తెలుసుకోరు?

నేను మెట్లుదిగిపో[illegible]తుంటే, అందరూ నాకు త్రోవయిచ్చేసేరు. ఎవ్వరికీ గూడా నన్ను అడ్డేపాటి ధైర్యం లేకపోయింది. నేను కొంతదూరం అలా వెళ్లిన తర్వాత వెనుక పాటున ముగ్గురు పోలీసులువచ్చి, నన్ను పడద్రోసి, నాచేతిలోని బాకు లాగుకొని, మీ ముందుకు తీసికొనివచ్చేరు. ఒక్కమనిషిని పట్టుకుందికి ఎందుకో వారికంత భయం?

ఇది నాకథ—నేనేదో నేరం చేసినట్టు పాప మాచరించినట్లు మీరు అనుమానపడతారని నా మనస్సులో ఉన్నదంతా మీకు చెప్పేను. నాకు ఉరిశిక్ష పడుతుందని తెలుసును. అందుకు నాకు భయంలేదు. కాని, నేను అనుకున్న పని ఇంకా పూర్తికాలేదు. మరొక పది ఇరవై మంది కయినా ముక్తి మార్గం చూపిద్దామని ఉంది... సరే. అదే అవసరముంటే నా అవసరం లేకుండానే పని జరిగిపోతుంది. ఒక చావుకి మరొక చావుని కలపడానికి ఎలాగూ ఈశాసనాలుఉన్నాయి. అందుకు మనం సంతోషించాలి.

"ఇంతకీ ఒక్కవిషయం చెప్పండి ఇక్కడ మీరు ముగ్గురు జడ్జీలున్నారు. ఎంతమందికో ఉరిశిక్ష వేసివుంటారు... ఎన్ని హత్యాపరాధాలనో చూసివుంటారు. ఎన్నో కేసులు విచారణచేసివుంటారు కాని, మీ రెప్పుడయినా ఊహించేరా, ఈలోకంలో జీవించడ మెందుకో? మీరూ ఏవో పెద్దచదువులు చదువుకున్నారు. నిశ్చలంగా, నిష్పాక్షికంగా ఆలోచించండి. రోజల్లా ఇక్కడ కూర్చొని లోకంలోఉన్న పాపానికంతా మీరే జవాబుదారులన్నట్టు అందరనూ విచారించి, మీకు తోచినవిధంగా పైవాళ్లకు జైలని, ఫైననీ, ఈవిధంగా శిక్షలు విధిస్తూ పగలు వేసిన శిక్షలతో రాత్రి మనశ్శాంతం పోగొట్టుకుంటూ ఎందుకు బ్రతుకుతున్నారు? మీరు ముగ్గురు లేకపోతే, లోకమే ఉండదనుకుంటున్నారా? మీరే ఈ ప్రపంచకంలో జరిగే నేరాలకన్నింటికి శిక్ష విధించాలా? నేరా లెన్నడానికి, శిక్ష విధించడానికి మీ కధికారమేమిటి? మీపొట్ట నింపుకుందికి ఏదో పనిచెయ్యాలనా మీ ఉద్దేశ్యం? ఆపొట్ట అనవరతమూ అలా నింపుకుంటూ, ఈ భౌతిక సౌఖ్యాలకోసం కొట్టుకుపోతూ, ఎందులోనో తెలివితక్కువలో ఆనందం అనుభవిస్తూ, 'నాకు కష్టంగా వుంది' 'నాకు సుఖంగా వుంది' అని ఇలా ఈ ఇంద్రజాలంలో కొట్టుకుపోతూ ఉండేకంటే, హాయిగా మీ ఇంట్లోవున్న ఎలక్ట్రిసిటీ సహాయాన్న ప్రాణాలు విడవాలని లేదు? మీరు చావడానికి భయపడి ఇంతమందిని చంపుతున్నారా? ఈచావుద్వారా జీవితంనుండి ఆనందంలోకి నెట్టినవాడిని నేరస్థుడని అంటున్నారా? ఆపని మీరు చెయ్యలేక, అలా చేసేవారిమీద ఈర్ష్యా? ఇంత పెద్ద చదువులు చదివి జీవించడం ఎందుకో తెలీక, చావుకి భయపడి, పిరికిపందల్లె గుడ్డెద్దు చేలో పడ్డట్టు మీరే ఏడుస్తుంటే, ఇంక తెలియని వారి సంగతేమిటి? పైగా ఆత్మహత్య దోషంట! అమ్మ పెట్టాపెట్టదు, అడుక్కొని తినానివ్వదు అన్నట్టుంది. సరే, కానీండి, నావలన కాక, ఇంకొకరివల్ల నాకు చావు వస్తున్నందుకు నాకెంతో ఆనందంగా వుంది. నేను ఒక కారణంకోసం చచ్చిపోతున్నాను. నేను మరణించినా నా ఆశయం చావదులెండి. అప్పుడే నా లుగు పెద్దబుర్రలూ మూడవ మహాసంగ్రామానికి విత్తుజల్లుతున్నారని విని ఎంతో సంతోషంగా ఉంది. ఇక తొందరగా మీజడ్జిమెంటు పూర్తిచేసి, నాకు రేపే ఉరిపడేట్టు చూడండి"

అని అతను తన స్టేటుమెంటు ముగించి, క్రిందకుదిగి, అక్కడ ఉన్న కుర్చీలలో కూర్చున్నాడు. కాపలాఉన్న పోలీసులు ఒద్దు అని చెప్పడానికి భయపడ్డారు. ఈకేసు ఎలాంటిదో చూద్దామని వచ్చిన విజిటర్లలో ఇద్దరు ముగ్గురు మూర్ఛపోయినట్లు తెలిసింది. జడ్జీల ముగ్గురికి ముఖం పాలిపోయింది. ఈరోజున వారు ఒక దయ్యాన్ని బోనులో నిలబెట్టినట్లు అనుకున్నారు. ఒకరికీ నోట మాట రాలేదు. ముఖాలు చెమటబొట్లతో నిండిపోయేయి. ఇతడు మనిషేనా అని వారి అనుమానం. మనషి అయివుండి కూడా ఇట్టి ఆశయాలు, ఊహాలు పెట్టుకొని, అంతటి ఘోరాలు సునాయాసంగా చెయ్యగలడా? లేక ఎవరికీ తెలియని దయ్యమా?

అతను తన సంగతి చెబుతున్నంతసేపూ ప్రతీ మనిషికీ ముచ్చెమటలుపోసేయి. వెంట్రుకలు నిటారుగా నిలిచిపోయేయి. గొంతుక ఎవరో నులిమివేస్తున్నట్టు అనుబించింది. ఎవరో కాళ్లుపట్టుకొని లాగివేస్తున్నట్టు తోచింది. విద్యుచ్ఛక్తి శరీరంలోంచి నిలువునా ప్రాకుతున్నట్టుఅయింది. 'ఇక చాలు, మరి చెప్పకు' అని ప్రతీవాడూ అందామనే అనుకున్నాడు కాని, ఒక్కరికీ మాట గొంతు దాటలేదు.

ఎలాగయితేనేం కొంతసేపటికి ముగ్గురు జడ్జీలు, ధైర్యంచేసి, ఏదోకూడబలుక్కొని ఈవిధంగా తమ జడ్జిమెంటు చదివేరు. "ఇతని స్టేటుమెంటునుబట్టియు, ఇతడు చేసిన హత్యావిధానమునుబట్టియు, ఈనేరములలో సంబంధంలేని ఇంకొన్ని విషయముల ననుసరించియు, ఇతడు ఈ హత్యలను చేయునప్పుడు, ఇప్పుడునుగూడ, పిచ్చివానిగా తోచుటచే కేసు కొట్టివేయ బడినది, కాని, ఇతనికి సంపూర్ణ

మానసికారోగ్యము చేకూరు వరకూ, ఒక పిచ్చి ఆసుపత్రిలో చాల కట్టుదిట్టముగా ఇతనిని ఉంచవలెను" అని చదివి లేచిపోయేరు.

"అయ్యో, నన్ను ఉరితియ్యరూ; ఇదా న్యాయం! నేను ఒకటికాదు, రెండుకాదు చాలాహత్యలు చేసేను. నన్ను ఉరితియ్యండి. నాకు బ్రతకాలనిలేదు. నాకు పిచ్చిలేదు; నేను ఎవరినీ కరవలేదు. రక్కలేదు. ఇది నావేదాంతం. నన్ను ఒదిలీయండి. మీరు చంపలేకపోతే నన్నేనా చావనీయండి. ఈ విధంగా జరుగుతుందని తెలుస్తే అప్పుడే కాలువలో పడిపోయి ఉందును" అని ఎంత మొరపెట్టుకున్నా వినక పోలీసులు లోపలికి ఈడ్చుకొని పోయేరు. 'రాక్షసులంటే ఇలాగే ఉంటారేమిటి చెప్మా?' అని ప్రతీవాడూ చితుకుగుండెలతో ఇంటిముఖం పట్టేరు. మరి నాలుగు రోజులవరకూ నిద్దర పట్టదని అందరూ అనుకుంటున్నదే. 'ఇదేమిటి ఈవింత వేదాంతం? ఈవిధంగా ఎవరూ చెప్పలేదే! ఇట్టి మనఃప్రవృత్తులు గలవారు కూడా ఉంటారా అని కొంతమంది ప్రశ్నించుకున్నారు. 'ఉంటారుగామోసు' అని జబాబు చెప్పుకుందికి ప్రతీవాడూ భయపడుతున్నాడు.

ఆరోజు సూర్యుడు యథాప్రకారంగా అస్తమించేడు. క్రిందటిమాటు హత్యలు జరిగిన రోజులలోకంటే, హత్య ఏవిధంగా జరిగిందో తెలిసిన ఈరోజునే మనుష్యులు ఎక్కువ భయపడుతున్నారని అతనికేం తెలుసును? మామూలుగానే తనపని మానకుండా అస్తమించేడు. రాత్రి ఎంతో హాయిగా వెన్నెల విరజిమ్ముతూ చంద్రుడు ఉదయించేడు. ఆ వెన్నెలలో గుడ్లగూబ ఎంతో ఆనందంగా వీరవిహారం చేస్తోంది. తీతువ తన గానాన్ని వెన్నెలలో కరగించివేస్తోంది. మందమారుతాల పూలతావులతోపాటు విషబీజాలను కూడా ఎంతో సంతసంతో స్వీకరించి, అందరకూ నిష్పాక్షికంగా పంచిపెడుతున్నాయి. ఎక్కడో ఒక ఇంటివెనుక రెండు పిల్లులు ఒక చచ్చిన ఎలుకలో వాటాలు కుదరక దెబ్బలాడుకుంటున్నాయి. ప్రక్కనున్న దొడ్డిలోని గొర్రెలు కసాయివాడు ప్రేమతోవేసిన గడ్డిని ఆప్యాయంగా తింటున్నాయి. మృత్యుదేవత తన వివిధరూపాలలో, మరునాటి తన కార్యరంగాలను ఒకమారు చూసుకుంటూ పోతోంది. ఆదేవత కెంత పని! ఒక్కక్షణం తెరిపి అనేది ఉండదు కదా?

తెల్లవారింది. సూర్యుడు ఉదయించకుండానే ఊళ్ళో ఎందుకో గోల పుట్టింది. ఎంత ఘోరం అంటే ఎంత ఘోరం అనే వాళ్ళే, అసలు సంగతి ఎవరికీ తెలీదు. ఏమిటయింది? అందరూ జడ్జీగార్ల బంగళాలవైపు పరిగెత్తేరు. ఇంకేమిటి, ముగ్గురూకూడా ఒకే గదిలో మూడు తాళ్ళకి వరసగా ఉరిపోసుకొని మధ్యన వ్రేలాడుతున్నారు దూలంనుంచి. ఆ దృశ్యం చూస్తున్నవారు అది నమ్మలేకపోయేరు... ఏమిటి? నిన్నటివరకూ కోర్టులో కూర్చొని ఎన్నో ఉరిశిక్షలు విధించిన ఆజడ్జీలేనా వీరు? ఇప్పుడు ఈవిధంగా తాళ్ళనుండి వ్రేలాడుతున్నది? వాళ్ళే! ఆ ముగ్గురే! నిన్నటి నేరస్తునికి మతి భ్రమించిందని ఎవరు తీర్పు చెప్పేరో, ఆ ముగ్గురు న్యాయాధిపతులే! ఇప్పుడు ఈవిధంగా కళేబరమాత్రులై వెక్కిరిస్తున్నట్లు కనుబిస్తున్నారు. అక్కడ దగ్గరగానున్న టేబిలుమీద ముగ్గురి సంతకాలతోటీ ఉన్న కాగితంలో ఈవిధంగా వ్రాసిఉంది.

"ఈనాటికి మేం కళ్లుతెరిచేం ... ఇప్పటికి మాకు జ్ఞానం కలిగింది...నిజంగా ఆ నేరస్తుడన్నదానిలో దోషం ఏమీ లేదు. మేము ముగ్గురము ఎందుకు జీవిస్తున్నాము? ఎందుకు ఇలా బొందిని పట్టుకొని వ్రేలాడుతున్నాము? మేము చనిపోతే నష్టమేమి? మాకేమీ నష్టం కనుపించలేదు. ఇంతకీ ఈ జీవించడమే మాకు దోషంలా కనుబిస్తున్నప్పుడు, అందులో వేరే నేరాలూ శిక్షలూ ఏమిటి? ఈకేసు వివరాలు సావకాశంగా యోచించిన పిమ్మట మాకు జీవించాలని లేదు. అందుచేత మరణించదలచుకున్నాం. నిన్నటి ఖైదీని విడచిపుచ్చి కొంత లోకోపకారం చేయనిద్దామనుకున్నాము గాని, మేము ఇప్పటివరకూ సేవచేస్తున్న గవర్నమెంటు శాసనాలు ఒప్పమిచే, మా హృదయానికి వ్యతిరిక్తంగా తీర్పు చెప్పవలసివచ్చింది. ఇంక మాకు ఈలోకంలో ఒక్కరోజు కూడా ఉండాలని లేదు. కావలిస్తే మా గురువుగారైన ఆ ఖైదీకేసు మరెవ్వరయినా విచారించి శిక్ష విధించవచ్చు ఇట్లు"

* * *

కాని, ఆఖైదీనిమాత్రం కొన్నాళ్ళ తర్వాత ప్రత్యేక అనుజ్ఞపొంది, విచారణ లేకుండానే ఎక్కడికో తీసికొనిపోయి తుపాకీతో కాల్చివేసినట్లు తెలిసింది. (సమాప్తం)

# ★ అన్వేషణ ★

రచన: మానేపల్లి వెంకటరాజు.

★

మేఘకన్యలతోడ
మేనుమరచితివంచు
వినువీథిపైకెగసి
వెదకి విసిగితినోయి!
నిరూపలావణ్య
మేరీతిగాంతునో!... దేవా!

తేనెవాకలయందు
తేలిపోతివటంచు
చిగురాకుదోనెక్కి
వెదకి విసిగితినోయి!
నీరూపలావణ్య
మేరీతిగాంతునో!... దేవా!

పూలపొదరిండ్లలో
పూలసెజ్జలపైన
సోలిపోతివటంచు
వెదకివిసిగితినోయి!
నీరూపలావణ్య
మేరీతి గాంతునో!... దేవా!

పయ్యెరలపరుగుతో
పక్షినైపయనించి
ప్రేమదేశాలన్ని
వెదకివిసిగితినోయి!
నీరూపలావణ్య
మేరీతిగాంతునో!... దేవా!

ఎడదజ్యోతినిచిదిమి
పుడమంత వెలిగించి
అణువణువుశోధించి
వెదకి విసిగితినోయి!
నీరూపలావణ్య
మేరీతిగాంతునో!... దేవా!

చిరునవ్వు వెన్నెలలు
కురిసేటి నీమోము
కనులగానకయున్న
మనలేనుక్షణమైన
నీరూపలావణ్య
మేరీతిఖాపెదో!... దేవా!